MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 312 | పేజీలు : 8 | ఆదివారం 1 నవంబర్ 2026 | వెల : 6-00

ఇంధన సరఫరాలో ఆంక్షలు.. అడ్డంకులు వద్దు!

జీ20 వేదికగా భారత్ గళం.. జైశంకర్ కీలక వ్యాఖ్యలు

చమురు రవాణా మార్గాలకు ఆటంకాలు సృష్టించొద్దు

సైనిక చర్యలతో సమస్యలు పరిష్కారం కావు.. దౌత్యానికే ప్రాధాన్యం

ఎల్‌పీజీ సరఫరాలో స్థిరత్వం తప్పనిసరి

5




అఖండ భారత రూపశిల్పికి ఘన నివాళి!

- జాతి ఉక్కుమనిషి పటేల్‌కు ప్రధాని, రాష్ట్రపతి వందనం
- స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద మోదీ పుష్పాంజలి
- ఆధునిక భారత నిర్మాణంలో పటేల్ పాత్ర చారిత్రాత్మకం: ముర్ము
- దేశ ఐక్యతకు ఆయన ఆశయాలే మార్గదర్శకం: అమిత్ షా

5



ముంచుకొస్తున్న మరో తుపాను



- ముందస్తు చర్యలపై రియల్ టైమ్ గవర్నెన్స్ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- ఈ నెల 3, 4 తేదీల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలకు అస్కారం
- విద్యుత్, మొబైల్ నెట్‌వర్క్‌కు అంతరాయం లేకుండా తగిన జాగ్రత్తలు
- తుఫాను వల్ల పడిపోయిన కొబ్బరి, అరటి రైతులకు తగిన నష్ట పరిహారం

అమరావతి, మహానగర్

అర్నబ్ తుపాను నష్టాల నుంచి రాష్ట్రాన్ని సాధారణ స్థితికి తీసుకొచ్చే పునరుద్ధరణ పనులను వేగవంతం చేయడంతో పాటు, మరో తుపాను ముప్పును ఎదుర్కొనేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం రేపటికి తుపానుగా బలపడే అవకాశాలున్నాయని, నవంబర్ 2, 3, 4 తేదీల్లో దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వివరించారు. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ నుంచి రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, అర్నబ్ తుపాను విధ్వంసం అనంతరం చేపడుతున్న పునరుద్ధరణ పనులపై సీఎం ఉన్నతాధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం గమనాన్ని ఉపగ్రహ చిత్రాలు, డాప్లర్ రాడార్ల ద్వారా ప్రతి ఆరు గంటలకు ఓసారి అంచనా వేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సమర్థ నీటి నిర్వహణ ద్వారా వర్షపు నీటిని సద్వినియోగం చేసుకునేందుకు ఉన్న అవకాశాలను కూడా గుర్తించి తగిన ప్రణాళిక చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. విద్యుత్ - మిగతా 2లో



ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంప్రదాయానికి నాంది!

- స్థానిక ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయంటూ జగన్ ఆగ్రహం
- నామినేషన్ల దశ నుంచే ఉల్లంఘనలు జరిగాయని ఆరోపణ
- దాడులు, బెదిరింపులతో అభ్యర్థులను అడ్డుకున్నారు
- నకిలీ నామినేషన్లు.. ఫోర్జరీ సంతకాలతో ఉపసంహరణ
- ఎన్నికల ప్రక్రియపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని డిమాండ్

అమరావతి, మహానగర్

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం ఆందోళనకర పరిస్థితులను ఎదుర్కొంటోందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నామినేషన్ల దశ నుంచే అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. ప్రతిపక్ష అభ్యర్థులను ఎన్నికల బరిలోకి రాకుండా అడ్డుకోవడం అత్యంత ప్రమాదకర సంప్రదాయానికి నాంది పలుకుతోందని వ్యాఖ్యానించారు. ఈ మేరకు శనివారం ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల దశ అత్యంత కీలకమని జగన్ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన ముఖ్య నేతలను గృహ నిర్బంధంలో ఉంచడం, బైండోవర్ చర్యలు చేపట్టడం ద్వారా పార్టీ అభ్యర్థులకు మద్దతుగా వెళ్లకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. మరోవైపు నామినేషన్ కేంద్రాల వద్ద అధికార పార్టీ కార్యకర్తలకు స్వేచ్ఛ కల్పించి, ప్రతిపక్ష అభ్యర్థులపై ఆంక్షలు - మిగతా 2లో


భారత వ్యతిరేక శక్తుల కుట్ర!



- దేశ విభజనకు ప్రయత్నాలు..
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- సోషల్ మీడియాలో అబద్ధాలు, వదంతులతో అస్థిరత సృష్టించే యత్నం
- భారతీయుల ఐక్యతే దేశానికి రక్షణ కవచం
- సర్దార్ పటేల్ 151వ జయంతి వేడుకల్లో ప్రధాని మోదీ వ్యాఖ్యలు

5

దిల్లీ మార్చ్‌కు రాహుల్ పిలుపు!



- అనుమతి లేదన్న పోలీసులు.. దేశ రాజధానిలో రాజకీయ వేడి
- నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో ఇండీ కూటమి భారీ ర్యాలీ
- మోదీ, అమిత్ షా, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నిరసన
- ట్రాఫిక్ ఆంక్షలు.. భారీ భద్రతా ఏర్పాట్లు



పదో తరగతి బాలికపై ఉన్మాది దాష్టీకం

- తరగతి గదిలో పిల్లలందరి మధ్య విచక్షణారహితంగా దాడి
- అడ్డుకోబోయిన మరో విద్యార్థినికీ తీవ్ర గాయాలు
- చదువుల తల్లి ఒడిలో రక్తపాతం.. వణికిపోయిన విద్యార్థులు
- అనంతపురం జిల్లా రాప్తాడు జెడ్పీ హైస్కూల్‌లో ఘటన

2లో

పోలింగ్‌కు సర్వం సిద్ధం!

- ప్రశాంత వాతావరణంలో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి!
- 13 కార్పొరేషన్లు.. 87 మున్సిపాలిటీల్లో ఎన్నికలు
- 75 వేల మంది సిబ్బందితో పోలింగ్ నిర్వహణ
- సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్ఠ బందోబస్తు
- సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్‌తో పర్యవేక్షణ
- ఎన్నికల సిబ్బందికి పెరిగిన పారితోషికం



అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో రేపు జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు. ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరిస్తూ పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 13 కార్పొరేషన్లు, 87 - మిగతా 2లో

సీఈసీపై ఇండీ కూటమి బహిరంగ అభిశంసన!

జ్ఞానేశ్ కుమార్‌పై ఖర్గే తీవ్ర ఆరోపణలు

ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్..

2023 నియామకాల చట్టాన్ని రద్దు చేయాలని తీర్మానం

బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు నిర్వహించాలని పట్టుబాటు

5

దిల్లీలో మాక్ పార్లమెంట్



మహానగర్

పదో తరగతి బాలికపై ఉన్మాది దాష్టీకం

రాప్తాడు

ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడుతున్న ఓ యువకుడు, తన ప్రేమను నిరాకరించిందనే అక్కసుతో బాలికపై ఎలక్ట్రిక్ రంపంతో దాడికి దిగడం సభ్య సమాజాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. అనంతపురం జిల్లా రాప్తాడు జెడ్పీ హైస్కూల్లో శనివారం ఉదయం 10.20 గంటలకు రెండో పీరియడ్‌లో టీచర్ గణితం పాఠం చెబుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. హేమంత్ అనే యువకుడు ఎలక్ట్రిక్ రంపంతో తరగతి గదిలోకి ప్రవేశించి.. గోపిక (15) అనే పదో తరగతి విద్యార్థినిపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె ముఖంపై తీవ్ర గాయాలుకాగా, కుడిచేయి దాదాపు తెగిపోయింది. అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని లక్ష్మీపైనా దాడి చేయడంతో ఆమె కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. రక్తపు మడుగులో పడివున్న విద్యార్థినులను హుటాహుటిన అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఫోరెన్సిక్ నిపుణులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఒళ్లంతా గాయాలే

హేమంత్ జరిపిన పాశవిక దాడిలో గోపిక శరీరమంతా లోతైన గాయాలయ్యాయి. ముఖంపై లోతైన గాయం కావడంతో సగ భాగం పూర్తిగా చెక్కేసినట్‌లైంది. ఎడమ చేతి ఎముక భాగం విరిగింది. ఎదపై లోతైన గాయమైంది. శరీరం ముందు భాగంలో చాలా చోట్ల రంపపు గాట్లు పడ్డాయి. వీపుపై కూడా లోతైన గాయాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. దాదాపు మూడు గంటలకు పైగా వైద్యులు శ్రమించి బాలికకు శస్త్రచికిత్స చేశారు. అనంతరం శనివారం సాయంత్రం మరింత మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

పోలీసుల అదుపులో నిందితుడు

పాఠశాలలో ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ధర్మవరం మండలం నాగలూరు గ్రామానికి చెందిన హేమంత్‌గా గుర్తించారు. తల్లిదండ్రులు లేని ఈ యువకుడు కొన్నేళ్లుగా అయ్యవారిపల్లి గ్రామంలోనే సోదరి వద్ద ఉంటూ అనంతపురం శివారులోని టమాటా మండీలో పని చేస్తున్నాడు. బాలికకు బంధువు కూడా. కొంత కాలంగా ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్నాడు. బాలిక నిరాకరించడంతో ఈ దారుణానికి ఒడిగట్టి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటన తర్వాత బైకులో పరారైన నిందితుడు హేమంత్‌ను ధర్మవరం రైల్వే గేటు సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఆ కుటుంబానికి తీరని శోకం..

రాప్తాడు మండలం అయ్యవారిపల్లికి చెందిన వెంకటరాముడు, నరసమ్మ దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. వెంకటరాముడు ద్రాక్ష తోటల్లో కూలి పనులు, నరసమ్మ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కుమారుడు ఇందువర్ధన్ చదువు మానేసి కడ్డీల కార్మికుడిగా వెళ్తున్నాడు. ఒక్కగానొక్క కుమార్తె గోపికను అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. చదువుకుని ఉన్నత స్థాయికి చేరుతుందన్న ఆశలతో పెంచుకుంటున్న బిడ్డపై బంధువే రాక్షసంగా దాడి చేయడం ఆ కుటుంబాన్ని తీరని వేదనలోకి నెట్టింది.

బడిలో భద్రత ఏదీ?

పాఠశాలలో నిర్మాణ పనులు జరుగుతుండటంతో కార్మికుడేమోనని భావించామని, ఘటన సమయంలో వాచ్‌మన్ గేటు వద్ద లేకపోవడంతో నిందితుడు లోపలికి ప్రవేశించాడని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి తెలిపారు. దాడి జరుగుతున్న సమయంలో పిల్లల కేకలతో ఏం జరుగుతోందో అర్థంకాక షాక్‌కు గురయ్యానని వివరించారు. ఈ ఘటనతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భద్రతపై తీవ్ర ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పాఠశాలల్లోకి ఎవరు పడితే వారు ప్రవేశించే పరిస్థితి ఎందుకు ఉంది? గేటు వద్ద పటిష్ట నిఘా ఎందుకు లేదు? విద్యార్థుల ప్రాణాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ఎవరిది? అన్న ప్రశ్నలు ఇప్పుడు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాయి.

ఉన్మాదిపై చట్టపరమైన చర్యలు : కలెక్టర్

రాప్తాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థినిపై దాడి చేసిన ఉన్మాదిపై చట్టపరమైన చర్యలు తప్పవని అనంతపురం కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలిని శనివారం మధ్యాహ్నం కలెక్టర్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎప్పటికప్పుడు బాలిక ఆరోగ్యంపై ఆరా తీస్తూ పర్యవేక్షణ చేస్తున్నామని చెప్పారు.

పాఠశాలల్లోనే భద్రత లేకపోతే ఎలా?

పాఠశాలల్లోనే విద్యార్థుల మాన ప్రాణాలకు రక్షణ లేకపోతే ఇక ఎక్కడ భద్రత ఉంటుందని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం అనంతపురం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గోపికను, ఆమె కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు.

108 వాహనం ఆలస్యం

ఉన్మాది హేమంత్ దాడిలో తీవ్రంగా గాయపడిన గోపికా, లక్ష్మీలను ఆస్పత్రికి వెంటనే తరలించడానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు 108కు ఫోన్ చేశారు. సమస్య తీవ్రతను వివరించారు. అయినా వాహనం రావడం ఆలస్యమైంది. దీంతో ఆందోళనకు గురైన ఉపాధ్యాయులు తొలుత ఆటోను పిలిపించి విద్యార్థినులను అందులో ఆస్పత్రికి తరలించారు. కొంతదూరం వెళ్లిన తర్వాత మార్గంమధ్యలో 108 వాహనం రావడంతో ఆటో నుంచి అంబులెన్స్‌లోకి మార్చి ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. అత్యవసర సమయంలో 108 వాహనం సకాలంలో అందుబాటులోకి రాకపోవడం చర్చనీయాంశమైంది.

బెజవాడలో త్రిముఖ పోరు

విజయవాడ

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు కేంద్రబిందువైన విజయవాడ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక రోజురోజుకూ ఉత్కంఠభరితంగా మారుతోంది. అధికార ఎన్డీయే కూటమి ఉమ్మడి అభ్యర్థిగా వంగవీటి రాధాకృష్ణ బరిలో నిలవగా, ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీ తరఫున మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి మరోసారి పోటీ పడుతున్నారు. అయితే, ఈ ద్విముఖ పోరును అనూహ్యంగా త్రిముఖ సమరంగా మారుస్తూ మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు స్వతంత్ర అభ్యర్థిగా రంగానికి దిగడం బెజవాడ రాజకీయ వాతావరణాన్ని ఒక్కసారిగా వేడెక్కించింది. వామపక్షాలు , కాంగ్రెస్ పార్టీల ఐక్య మద్దతుతో ఆయన నిర్వహిస్తున్న ప్రచారం సాంప్రదాయ రాజకీయ పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది.మాజీ సీపీగా బెజవాడ నగరంపై పరిపూర్ణమైన పట్టు, శాంతిభద్రతలపై స్పష్టమైన అవగాహన ఉన్న ఏబీ వెంకటేశ్వరరావు తన ప్రచారాన్ని ప్రత్యేక శైలిలో నిర్వహిస్తున్నారు. అవినీతి రహిత నగర పాలన, పన్నుల భారం తగ్గించడం, లంచాలు లేని సేవలు అనే నినాదాలతో మేధావులు, మధ్యతరగతి , విద్యాధికుల ఓటు బ్యాంక్‌ను ఆకర్షించేందుకు ఆయన తీవ్రంగా శ్రమిస్తున్నారు. వామపక్ష బలానికి తోడు కాంగ్రెస్ పార్టీ మద్దతు లభించడం, అలాగే సీనియర్ ఐపీఎస్‌గా ఆయనకున్న నిష్కళంకమైన ఇమేజ్ ఏబీవీకి ప్రధాన బలంగా మారాయి. ఏ రాజకీయ పార్టీ బంధాలు లేకుండా, కేవలం విజయవాడ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఆయన విసురుతున్న సవాళ్లు ప్రధాన పార్టీల అభ్యర్థులకు మింగుడుపడటం లేదు.అయితే, ఎన్డీయే కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న వంగవీటి రాధాకృష్ణకు బలమైన ప్రజాదరణ, వంగవీటి కుటుంబానికి నగరంలో ఉన్న అభిమానుల బలగం పెద్ద ప్లస్ పాయింట్. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తనను గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆసక్తికరమైన విషయమేమిటంటే.. రాధాకృష్ణ, ఏబీ వెంకటేశ్వరరావు ఇద్దరూ ఒకరిపై ఒకరు వ్యక్తిగత విమర్శలు చేసుకోకుండా అత్యంత హుందాతనంతో ప్రచారం సాగిస్తుండటం ఈ ఎన్నికల ప్రత్యేకతగా నిలిచింది. రాధా సైతం నగరాభివృద్ధికి ఏబీవీ సలహాలు తీసుకుంటా అని ప్రకటించగా, ఏబీవీ కూడా మాది భావజాల పోరాటమే తప్ప వ్యక్తిగతం కాదని స్పష్టం చేశారు.మరోవైపు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రాయన భాగ్యలక్ష్మి బిసి సామాజిక వర్గ సమీకరణాలు, తమ హయాంలో చేసిన అభివృద్ధి పనులనే నమ్ముకుని ముందుకు వెళ్తున్నారు. అయితే, ఓట్ల చీలిక ఎవరికి లాభిస్తుందనేది ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది. నాన్–పొలిటికల్, న్యూట్రల్ ఓటర్లు, మార్పు కోరుకునే వర్గాలు గనక ఏబీవీ వైపు మొగ్గుపడితే కూటమి, వైసీపీ ఓట్ బ్యాంకుల్లో భారీగా గండిపడే అవకాశం ఉంది. బెజవాడ ఓటర్లు ఎప్పుడూ ఊహించని సంచలన తీర్పులకు వేదికగా నిలుస్తారనే చరిత్ర ఉండటంతో, ఏబీవీ గెలుపు అవకాశాలను రాజకీయ విశ్లేషకులు తోసిపుచ్చలేకపోతున్నారు. వంగవీటి రాధా పవర్ కేడర్, రాయన భాగ్యలక్ష్మి పార్టీ క్యాడర్ బలానికి ఎదురీదుతూ ఏబీ వెంకటేశ్వరరావు సృష్టిస్తున్న ఈ ట్రెండ్ బెజవాడ రాజకీయాల్లో కొత్త చరిత్రకు పునాది వేస్తోంది. సంప్రదాయ పార్టీల ధనప్రవాహం, కుల సమీకరణలను దాటుకుని, వామపక్షాల సంపూర్ణ సహకారంతో ఏబీవీ నిజంగానే బెజవాడ పీఠంపై సంచలనం సృష్టిస్తారా లేక కూటమి–వైసీపీల హోరాహోరీ మధ్య స్వతంత్ర హోదాకే పరిమితమవుతారా అనేది పోలింగ్ ఫలితాలు తేల్చనున్నాయి.

రాఘవేంద్రరావు మరదలు, జగపతిబాబు చెల్లెలు.. మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మి అపర్ణ

గుంటూరు

గుంటూరు కార్పొరేషన్ మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మి అపర్ణ కుటుంబ నేపథ్యంపై ఆసక్తికర సమాచారం వెలుగుచూసింది. ఆమె విజయాన్ని కాంక్షిస్తూ ఇద్దరు సినీ ప్రముఖులు వీడియో సందేశాలు విడుదల చేశారు. ఆ ఇద్దరూ లక్ష్మి అపర్ణకు దగ్గర బంధువులుగా చెబుతున్నారు. లక్ష్మి అపర్ణను గుంటూరు మేయరుగా గెలిపించాలని దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు, ప్రముఖ హీరో జగపతిబాబు ప్రత్యేకంగా వీడియోలు విడుదల చేశారు. రాఘవేంద్రరావు, మేయర్ అభ్యర్థి లక్ష్మి అపర్ణ భర్త కోవెలమూడి రవీంద్ర సోదరులుగా చెబుతున్నారు. అదేవిధంగా లక్ష్మి అపర్ణ తనకు సోదరి అంటూ స్వయంగా జగపతిబాబు వెల్లడించారు. గుంటూరు టీడీపీ నేత, మాజీ మేయర్ రవీంద్ర అలియాస్ నాని రాజకీయాల్లో చాలా సీనియర్. అయినప్పటికీ ఆయన బంధుత్వంపై గుంటూరు వాసులకు తప్ప రాష్ట్రంలో ఇతర ప్రాంతాల వారికి తెలియదు. తొలిసారిగా ప్రత్యక్ష ఎన్నికల పోరులో రవీంద్ర కుటుంబం దిగడంతో ఆయన బంధువులు బయటకు వస్తున్నారు. కోవెలమూడి లక్ష్మి అపర్ణను గెలిపించాలని కోరుతున్నారు. ఇందులో సినీ ప్రముఖులు అయిన రాఘవేంద్రరావు, జగపతిబాబు విడుదల చేసిన వీడియోలు తెగ వైరల్ అవుతున్నాయి గుంటూరు ప్రజలకు విన్నపం నా చెల్లి లక్ష్మి అపర్ణ మేయరుగా పోటీ చేస్తున్నారని జగపతిబాబు విడుదల చేసిన వీడియో ఆకట్టుకుంటోందని చెబుతున్నారు. ప్రజలు చాలా తెలివైన వారని, ఎవరిని గెలిపించాలో వారికి బాగా తెలుసు అన్న జగపతిబాబు గత ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించినట్లుగానే లక్ష్మి అపర్ణను గెలిపించాలని కోరారు. నా చెల్లికి మంచి మనసు ఉంది. సమర్థురాలు అంటూ ఆయన కితాబునిచ్చారు. ఇక జగపతిబాబు చెల్లెలుగా లక్ష్మి అపర్ణను పరిచయం చేయడంతో వారి మధ్య బంధుత్వంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందిప్రముఖ నిర్మాత వీబీ రాజేంద్రప్రసాద్ కుమారుడైన జగపతిబాబుకు ఇద్దరు సోదరులు మాత్రమే ఉన్నారని సమాచారం.

బెంగళూరు ప్యాలెస్ రగడ.. రాజకీయంగా డ్యామేజ్?

కడప

తెలుగు రాష్ట్రాల రాజకీయంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన వైఎస్సార్ కుటుంబంలో ఆస్తుల తగాదాలు ఇప్పుడు చౌరస్తాకు వచ్చాయి. వైఎస్ కుటుంబంలో ఇప్పటికే సరస్వతి పవర్ షేర్లతో పాటు పలు ఆస్తుల వ్యవహారాలు ఎన్‌సిఎల్‌టి కోర్టు మెట్లు ఎక్కగా, తాజాగా బెంగళూరులోని యలహంక ప్యాలెస్ వివాదం సరికొత్త రాజకీయ దుమారాన్ని రేపుతోంది. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మధ్య సాగుతున్న ఈ శత్రుత్వంలో.. వైఎస్సార్ కూతురు షర్మిల తన కుమార్తె అంజలి వివాహ వేడుకను యలహంక ప్యాలెస్‌లో నిర్వహించాలని భావించడం, దానికి జగన్ భద్రతా కారణాలు చెబుతూ అనుమతించకపోవడం రాజకీయ వర్గాల్లో విస్తుపోయేలా చేస్తోంది.ఈ బెంగళూరు ప్యాలెస్ కేవలం ఒక విలాసవంతమైన భవనం మాత్రమే కాదు, వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలోనే కుటుంబం కోసం నిర్మించిన ఆస్తి. గతం నుండి షర్మిల ఇక్కడ సుదీర్ఘకాలం నివాసముండటంతో పాటు, కుటుంబ అవసరాలకు ఇది నిలయంగా మారింది. అందుకే తన కూతురు వివాహ శుభలేఖలలో కూడా షర్మిల వివాహ వేదికగా యలహంక ప్యాలెస్‌ను ముద్రించి ఆహ్వానాలు కూడా పంచారు. అయితే, నా ఇంట్లోకి వివాహ కేటరింగ్, ఈవెంట్ మేనేజర్లు, ఫోటోగ్రాఫర్లు రావడం వల్ల నా భద్రతకు, ప్రైవసీకి తీవ్ర ముప్పు ఏర్పడుతుంది అంటూ జగన్ లేఖ రాయడం, హైదరాబాద్ లోటస్ పాండ్‌ను వాడుకోవాలని సూచించడంపై షర్మిల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ తండ్రి వైఎస్సార్ కట్టించిన ఆస్తిలో తనకూ సమాన హక్కు ఉందని ఆమె వర్గం సెంటిమెంట్ అస్త్రాన్ని బలంగా ప్రయోగిస్తోంది.ఈ వివాదంలో సామాజికంగా, రాజకీయంగా లభిస్తున్న ప్రజాభిప్రాయాన్ని గమనిస్తే, సానుభూతి పవనాలు పూర్తిగా షర్మిల వైపే వీస్తున్నాయి. ఎంత రాజకీయం ఉన్నా, కన్న చెల్లెలి కూతురు పెళ్లికి.. అదీ సొంత మేనకోడలి కళ్యాణానికి ప్యాలెస్‌ను తిరస్కరించడం ఏ రకమైన సంస్కృతి అని నెటిజన్లు, ప్రజలు సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. ఏపీలోని ప్రత్యర్థి పార్టీలు ఎన్డీయే, టీడీపీ నేతలు కూడా జగన్ వైఖరిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. సొంత చెల్లెలికి, మేనకోడలికి న్యాయం చేయలేని నాయకుడు ప్రజలకు ఏం న్యాయం చేస్తాడు? అంటూ చంద్రబాబు, నారా లోకేష్ విమర్శలు గుప్పిస్తుండటం వైఎస్సార్‌సీపీని తీవ్ర ఇరకాటంలో పడేసింది.ఇక పొలిటికల్ ఇమేజ్ పరంగా చూస్తే జగన్ మోహన్ రెడ్డికి ఈ ఘటన వల్ల జరిగే నష్టం అంతా ఇంతా కాదు. 2024 ఎన్నికల ఘోర పరాజయం తర్వాత వైఎస్సార్‌సీపీ మళ్లీ పుంజుకునేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో, ఇటువంటి పర్సనల్ ఇష్యూస్ జగన్ ప్రజాదరణను మరింత దిగజారుస్తున్నాయి. ముఖ్యంగా కుటుంబ సభ్యులు, వైఎస్ విజయమ్మ కూడా షర్మిల పక్షాన నిలబడటంతో.. జగన్ వద్ద పనిచేస్తున్న రాజకీయ సలహాదారులు, కోటరీ ఆయనకు సరైన సలహాలు ఇవ్వడంలో ఘోరంగా విఫలమవుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సాంకేతిక, చట్టపరమైన, ప్రైవసీ సాకులు చెప్పి మేనకోడలి పెళ్లిని నిరోధించడం కంటే, పెద్ద మనసుతో వేడుకకు అనుమతిస్తే రాజకీయంగా పాయింట్లు స్కోర్ చేసే అవకాశం ఉండేదన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.జగన్ వైఖరి వెనుక ఉన్న పట్టుదల లేదా మంకుపట్టుదల ఆయనను రోజురోజుకూ జనాల్లో ప్రతికూల నాయకుడిగా నిలబెడుతోంది. నేను చెప్పిందే వేదం, నా మాటే శాసనం అనే దోరణి రాజకీయంలోనైనా, కుటుంబంలోనైనా దెబ్బతీస్తుందనేది ఈ ఉదంతం నిరూపిస్తోంది. ఒకవేళ భద్రతే కారణమైతే పగడ్బందీ సెక్యూరిటీ అరెంజ్‌మెంట్స్ చేసుకుని పెళ్లి జరిపించే అవకాశాలు ఉన్నప్పటికీ.. అంతగా భీష్మించుకుని కూర్చోవడం వల్ల వైఎస్సార్ అభిమానుల్లో సైతం జగన్ పట్ల తీవ్ర నైతిక అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ బెంగళూరు ప్యాలెస్ వివాదం కేవలం ఒక ఇల్లు లేదా కళ్యాణ వేదికకు పరిమితమైన సమస్య కాదు. వైఎస్ కుటుంబంలో ఏర్పడిన ఆస్తులు, రాజకీయ వారసత్వ పోరు క్లైమాక్స్‌కు చేరిందనడానికి ఇది స్పష్టమైన సంకేతం. సలహాదారుల లోపమో లేక సొంత పట్టుదలో కానీ, ఈ వివాదంలో జగన్ తన ఇమేజ్‌ను మరింత డ్యామేజ్ చేసుకుంటుంటే.. షర్మిల మాత్రం బాధితురాలిగా ప్రజా సానుభూతిని కూడగట్టుకోవడంలో ముందంజలో ఉన్నారు. రాబోయే రోజుల్లో ఈ ఆస్తుల రగడ కోర్టుల్లో ఎలాంటి మలుపులు తిరుగుతుందో, వైఎస్సార్‌సీపీపై ఎలాంటి రాజకీయ ప్రభావం చూపుతుందో వేచి చూడాలి.

రాజకీయాల్లో బంధువులు... వేర్వేరు పార్టీల్లో కుటుంబసభ్యులు

విజయవాడ

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సమరం రక్త సంబంధీకులు, బంధువుల మధ్య హోరాహోరీ పోరుగా రూపాంతరం చెందింది. రాజకీయ సమీకరణాలు, రిజర్వేషన్ల కేటాయింపుల పుణ్యమాని ఒకే కుటుంబానికి చెందిన వారు వేర్వేరు జెండాలు పట్టుకుని ఒకరిపై ఒకరు పోటీకి సిద్ధమవడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఎన్నికల వేళ పల్లెల్లో నెలకొన్న ఈ విచిత్రమైన వాతావరణం ఓటర్లతో పాటు స్థానికంగా హాట్ టాపిక్ అవుతోంది. మహిళా రిజర్వేషన్ అయిన చోట భార్యాభర్తలు కలిసి పోటీ చేస్తుంటే, మరికొన్ని చోట్ల ఒకే కుటుంబం నుంచి ఒకే స్థానానికి పోటీపడుతూ పదవి తమ గుమ్మం దాటకుండా చూపుకుంటున్నారని వ్యాఖ్యానిస్తున్నారు

ముంచుకొస్తున్న మరో తుపాను

-మొదటిపేజీ తరువాయి

అంతరాయం ఏర్పడినా మొబైల్ నెట్‌వర్క్ పనిచేసేలా అన్ని మండల కేంద్రాల్లో డీజిల్ జనరేటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రాష్ట్రంలోని బీఎస్ఎన్ఎల్ 4,500 టవర్లతో పాటు ఇతర టెలికాం నెట్‌వర్క్‌లకు నిరంతర విద్యుత్ అందించే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ అవకాశాలను కూడా పరిశీలించాలని చెప్పారు. అర్నబ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో 7 వేల మంది సిబ్బంది, 400 యంత్రాలతో విద్యుత్ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. వీటిని వేగంగా పూర్తి చేసి అన్ని గృహాలకు విద్యుత్ సరఫరా అందించాలని సీఎం ఆదేశించారు. తుఫాను సమయంలో దెబ్బతిన్న రోడ్లను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని సీఎం ఆదేశించారు. కాకినాడ వద్ద ప్రొటెక్షన్ వాల్‌ను పునరుద్ధరించాలన్నారు. నరసాపురం, కాట్రేనికోన ప్రాంతాల్లో కాలువల పూడిక తొలగించాలని సూచించారు. కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లో నీరు దిగువ ప్రాంతాలకు సజావుగా వెళ్లేలా డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. భవిష్యత్తులో రోడ్లు, కాలువలు ముంపునకు గురికాకుండా ప్రత్యేక ఎస్ఓపీ రూపొందించాలని ఆదేశించారు. ప్రకృతి విపత్తుల నుంచి రైతులను ఆదుకునేందుకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు పంటల బీమాపై విస్తృత అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. వచ్చే సీజన్ నుంచి ప్రతి రైతు బీమా పరిధిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. 47 లక్షల మంది రైతులకు చేరువయ్యేందుకు యాప్‌ను వినియోగించుకోవాలని, ప్రకృతి వ్యవసాయంపై చైతన్యం కల్పించాలని చెప్పారు. సాంకేతికతను వినియోగిస్తున్న చాంపియన్ రైతులను గుర్తించాలని సూచించారు. అర్నబ్ తుపాను వల్ల కొబ్బరి, అరటి పంటలకు జరిగిన నష్టంపై ముఖ్యమంత్రి సమీక్షించారు. కొబ్బరి పంట దెబ్బతిన్న 1,293 హెక్టార్లకు హెక్టారుకు రూ.54 వేల చొప్పున, నేల కొరిగిన, తలలు దెబ్బతిన్న ఒక్కో కొబ్బరి చెట్టుకు రూ.1,500 చొప్పున పరిహారం అందించాలని ఆదేశించారు. సుమారు 1.95 లక్షల కొబ్బరి చెట్లు దెబ్బతిన్నట్లు అధికారులు వివరించారు. అలాగే 15 వేల హెక్టార్లలో దెబ్బతిన్న అరటి పంటకు హెక్టారుకు రూ.35 వేల చొప్పున పరిహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో ఐటీ, ఆర్టీజీఎస్ కార్యదర్శి కాటమనేని భాస్కర్, విద్యుత్, విపత్తుల నిర్వహణ శాఖల ఉన్నతాధికారులు, వివిధ టెలికాం సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంప్రదాయానికి నాంది!

-మొదటిపేజీ తరువాయి

విధించారని విమర్శించారు. ఈ క్రమంలో తమ పార్టీ అభ్యర్థులపై దాడులు చేసి నామినేషన్ పత్రాలను చించివేశారని, మహిళా అభ్యర్థులనూ వదిలిపెట్టలేదని ఆరోపించారు.

నకిలీ నామినేషన్లతో గందరగోళం

వైఎస్సార్‌సీపీ అధికారిక అభ్యర్థులను నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకుంటూనే, కొందరు ఇతరులు పార్టీ పేరుతో నామినేషన్లు వేశారని జగన్ ఆరోపించారు. దీనివల్ల ప్రతిపక్షానికి కూడా పోటీ చేసే అవకాశం కల్పించినట్లు తప్పుడు అభిప్రాయం కలిగించారని అన్నారు. పార్టీ అధికారిక అభ్యర్థులను నిర్ధారించే ఫారం–ఏ, ఫారం–బీలను సైతం పట్టించుకోలేదని విమర్శించారు.

స్క్రూటినీ పేరుతో తిరస్కరణలు

అన్ని అడ్డంకులను అధిగమించి నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులపై ఒత్తిళ్లు తెచ్చారని జగన్ ఆరోపించారు. నామినేషన్లు ఉపసంహరించుకోవాలని బెదిరించడంతో పాటు, అందుకు అంగీకరించని వారి పత్రాలను చిన్నచిన్న కారణాలతో తిరస్కరించారని పేర్కొన్నారు. అభ్యర్థులు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలను తొలగించడం లేదా తారుమారు చేయడం ద్వారా లోపాలు సృష్టించారని ఆరోపించారు.

ఫోర్జరీ సంతకాలతో ఉపసంహరణలా?

కొన్ని చోట్ల అభ్యర్థుల అనుమతి లేకుండానే వారి నామినేషన్లు ఉపసంహరించుకున్నట్లు చూపించారని జగన్ పేర్కొన్నారు. సంతకాలను ఫోర్జరీ చేసి ఉపసంహరణ పత్రాలు సమర్పించినా అధికారులు వాటిని ఆమోదించారని ఆరోపించారు. ఈ పరిణామాలపై పోలీసులు, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల యంత్రాంగం పాత్రపైనా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు.

స్వతంత్ర దర్యాప్తు జరపాలి

ఎన్నికల ప్రక్రియలో చోటుచేసుకున్నాయని చెబుతున్న ప్రతి ఫిర్యాదుపైనా స్వతంత్ర దర్యాప్తు జరపాలని జగన్ డిమాండ్ చేశారు. నామినేషన్ పత్రాలు, స్క్రూటినీ రికార్డులు, ఉపసంహరణ పత్రాలు, వీడియో పుటేజీని భద్రపరిచి పరిశీలించాలని కోరారు. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, అన్యాయంగా ఎన్నికల బరి నుంచి తప్పించిన అభ్యర్థులకు తిరిగి పోటీ చేసే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన దశల్లోనూ ఇలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయేమోనని ఆందోళన వ్యక్తం చేశారు. అభ్యర్థులు స్వేచ్ఛగా పోటీ చేసేలా, పోలింగ్ ఏజెంట్లు విధులు నిర్వహించేలా, ఓటర్లు ఎలాంటి భయం లేకుండా ఓటు వేసేలా స్వతంత్ర పర్యవేక్షణ ఉండాలని జగన్ కోరారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం!

-మొదటిపేజీ తరువాయి



మున్సిపాలిటీల్లో పోలింగ్ జరగనుంది. ఇప్పటికే కార్పొరేషన్లలో 118 మంది కార్పొరేటర్లు, మున్సిపాలిటీల్లో 756 మంది కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పునేఠా వివరించారు. మిగిలిన స్థానాలకు ఓటింగ్ నిర్వహించేందుకు సుమారు 75 వేల మంది సిబ్బందిని విధుల్లో నియమించినట్లు చెప్పారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం

ప్రతి ఓటరూ ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామని కమిషనర్ తెలిపారు. ముఖ్యంగా పల్నాడు జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు భద్రత కల్పించినట్లు పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తగిన బందోబస్తు ఏర్పాటు చేశామని, పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతను డీజీపీ స్వయంగా పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. కలెక్టర్లు, ఎస్పీలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటున్నట్లు తెలిపారు.

సీసీ కెమెరాలు.. వెబ్‌కాస్టింగ్

పోలింగ్ కేంద్రాలతో పాటు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాల నిఘా, వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు పునేఠా చెప్పారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ సరళిపై వివరాలు వెల్లడిస్తామని, ఎక్కడైనా అక్రమాలు చోటుచేసుకుంటే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఓటింగ్ శాతం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్

అంబరాన్నంటిన సరస్ సంబరం

సరస్ మేళా వేదికగా లఖ్‌పతిదీదీల సాధికారతకు సరికొత్త ఊపు.. ఇప్పటికే రూ. 12.11 కోట్ల అమ్మకాలతో సరికొత్త రికార్డు నమోదు

సందర్శకుల కోరిక మేరకు నవంబర్ 1 సాయంత్రం వరకు మేళా అందుబాటులో.. దేశవ్యాప్త స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు విశేష ఆదరణ

ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సరస్ సమన్వయకర్త కటారియా, సెర్ప్ డైరెక్టర్లు చక్రవర్తి, శివశంకర్





విజయవాడ, మహానగర్

కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ దీనదయాళ్ అంత్యోదయ యోజన-జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ ఆధ్వర్యంలో ఏపీ సెర్ప్‌తో కలిసి విజయవాడ పున్నమిఘాట్ వద్ద 19 రోజులుగా జరుగుతున్న నిర్వహించిన జాతీయ సరస్ మేళా-2026 మహిళా శక్తిని చాటిచెప్పింది. లఖ్‌పతిదీదీల సాధికారతకు సరికొత్త ఊపు తెచ్చింది. గ్రామీణ మహిళల ఆత్మవిశ్వాసానికి, ఆర్థిక స్వావలంబనకు మేళా ఒక విజయవంతమైన వేదికగా నిలిచింది. మేళా ముగుస్తున్న సమయంలో శనివారం సరస్ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్,సెర్ప్ డైరెక్టర్లు చక్రవర్తి, శివశంకర్, సరస్ సమన్వయకర్త కటారియా తదితరులు అత్యుత్తమ స్టాళ్ల లఖ్‌పతిదీదీలకు సర్టిఫికెట్లు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ తొలిసారి ఢిల్లీని దాటి సరస్ విజయవాడ వచ్చిందని... ఈ మేళా మహిళా శక్తి సామర్థ్యాన్ని, గ్రామీణ మహిళల పారిశ్రామిక ప్రతిభను చాటిచెబుతూ ఘన విజయాన్ని సాధించిందని పేర్కొన్నారు. ఈ జాతీయ స్థాయి మేళాలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొని తమ ఉత్పత్తులను ప్రదర్శించగా, సందర్శకుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. 50 లైవ్ ఫుడ్ స్టాళ్లతో పాటు మొత్తం 650 వరకు స్టాళ్లు ప్రజలకు మధురానుభూతులను మిగిల్చాయన్నారు. గ్రామీణ మహిళల్లో అపారమైన నైపుణ్యం, సృజనాత్మకత, వ్యాపార సామర్థ్యం దాగి ఉన్నాయని, వాటిని సరైన మార్కెట్ అవకాశాలతో అనుసంధానిస్తే వారు విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగగలరని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ దిశగా సరస్ ఆజీవిక మేళా ఒక అద్భుతమైన జాతీయ వేదికగా నిలిచిందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లలో చేనేత వస్త్రాలు, హస్తకళా ఉత్పత్తులు, గృహోపకరణాలు, సంప్రదాయ కళాఖండాలు, ఆహార పదార్థాలు, ప్రాంతీయ ప్రత్యేక ఉత్పత్తులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయని తెలిపారు. విభిన్న ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలు, కళానైపుణ్యాలు, ఆహార వైవిధ్యాన్ని ఒకే వేదికపై పరిచయం చేయడంలో సరస్ విజయవంతమైందన్నారు. లఖ్‌పతి దీదీలుగా ఎదుగుతున్న మహిళలకు తమ ఉత్పత్తులను విస్తృత మార్కెట్‌కు పరిచయం చేసుకునేందుకు, కొత్త కొనుగోలుదారులను సంపాదించుకునేందుకు, వ్యాపార సంబంధాలను అభివృద్ధి చేసుకునేందుకు ఎంతో దోహదపడిందన్నారు. సరస్ మేళాలో నమోదైన రూ. 12.11 కోట్ల అమ్మకాలు మహిళా స్వయం సహాయక సంఘాల కృషి, నాణ్యమైన ఉత్పత్తులు, వ్యాపార నైపుణ్యానికి ప్రతిబింబమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ అమ్మకాలు మహిళల్లో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో తమ వ్యాపారాలను విస్తరించుకోవడానికి ప్రోత్సాహాన్నిస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన స్టాళ్ల ద్వారా దాదాపు రూ. 2 కోట్ల వరకు అమ్మకాలు జరిగాయి. సరస్ మేళా సందర్భంగా దేశవ్యాప్తంగా పాల్గొన్న స్వయం సహాయక సంఘాల మహిళలకు వివిధ అంశాలపై ప్రత్యేక వర్క్‌షాప్‌లు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. బిగ్ బ్రాండ్ ఫర్ స్మాల్ బిజినెస్, సెల్ ఆన్‌లైన్ గ్రో ఫాస్ట్, సోషల్ కామర్స్ తదితర శీర్షికలతో ఉత్పత్తుల నాణ్యత పెంపు, ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ వ్యూహాలు, ధరల నిర్ణయం, డిజిటల్ మార్కెటింగ్, ఆన్‌లైన్ విక్రయాలు, ఎగుమతి అవకాశాలు, వ్యాపార నిర్వహణ వంటి అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు. కొనుగోలుదారులతో వ్యాపార సంబంధాలు ఏర్పరచుకోవడం, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులను అభివృద్ధి చేసుకోవడం, తమ వ్యాపారాలను విస్తరించుకోవడంపై ఆచరణాత్మక సూచనలు అందించారు. మహిళలు సమర్థవంతమైన మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఇవి దోహదపడ్డాయి. సరస్ మేళాలో ప్రతిరోజూ సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు, జానపద కళారూపాలు, సంగీత కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు మేళా ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆయా రాష్ట్రాల భాష, సంస్కృతి, సంప్రదాయాలు, కళా వైభవాన్ని ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ కార్యక్రమాలు జాతీయ సమైక్యత, సాంస్కృతిక ఐక్యతకు ప్రతీకగా నిలిచాయి. మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల ప్రదర్శనలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా మేళాకు మరింత శోభను తీసుకొచ్చి సందర్శకులకు ఆహ్లాదకరమైన అనుభూతిని అందించాయి. సరస్ మేళా విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, స్టాల్ నిర్వాహకులు, కళాకారులు, మీడియా ప్రతినిధులు, ప్రజలకు జిల్లా కలెక్టర్, సెర్ప్ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌టీఆర్ జిల్లా డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు. సరస్ మేళాకు సందర్శకుల నుంచి లభించిన విశేష స్పందన, ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని నవంబర్ 1వ తేదీ సాయంత్రం వరకు కూడా మేళాను కొనసాగించాలని నిర్ణయించినట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లలోని విభిన్న ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ప్రజలకు మరో అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

కూటమి అభ్యర్థుల గెలుపు గ్రామాల అభివృద్ధికి మలుపు

జనసేన పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త మండలి వెంకట్రామ్
చల్లపల్లి, లక్ష్మీపురం, మంగళాపురం, మాజేరుల్లో విస్తృత ప్రచారం

చల్లపల్లి, మహానగర్

కూటమి అభ్యర్థుల గెలుపు గ్రామాల అభివృద్ధికి మలుపు అని జనసేన పార్టీ మచిలీపట్టణం పార్లమెంట్ నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్త మండలి వెంకట్రామ్ అన్నారు. శనివారం సాయంత్రం చల్లపల్లి-3, చల్లపల్లి-4 సెగ్మెంట్లు, లక్ష్మీపురం-2, లక్ష్మీపురం-3, లక్ష్మీపురం-4, మంగళాపురం, మాజేరు సెగ్మెంట్లలో కూటమి అభ్యర్థుల గెలుపు కోసం వెంకట్రామ్, జడ్పీటీసీ అభ్యర్థి రావెళ్ల ఉదయ్ కుమార్ తో కలిసి విస్తృత ప్రచారం చేశారు. కూటమి బలపరిచిన టీడీపీ జడ్పీటీసీ అభ్యర్థి రావెళ్ల ఉదయ్ కుమార్, జనసేన



ఎంపీటీసీ అభ్యర్థులు చల్లపల్లి-4 సెగ్మెంట్ జనసేన ఎంపీటీసీ అభ్యర్థి బొందలపాటి శ్యామసుందరి, చల్లపల్లి-3 సెగ్మెంట్ జనసేన ఎంపీటీసీ అభ్యర్థి అద్దేపల్లి జయలక్ష్మి సాయికుమారి, లక్ష్మీపురం-3 జనసేన ఎంపీటీసీ అభ్యర్థి కొల్లూరి కోటేశ్వరరావు, లక్ష్మీపురం-2 జనసేన పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి పాము లలిత,



లక్ష్మీపురం-4 జనసేన పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి సూదాని సంపతలక్ష్మి, మంగళాపురం జనసేన ఎంపీటీసీ అభ్యర్థి నల్లమోతు వీరయ్య, మాజేరు జనసేన ఎంపీటీసీ అభ్యర్థి కాగిత రమేష్ గెలుపు కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకన్నపాలెంలో టీడీపీ అభ్యర్థుల విస్తృత ప్రచారం

జడ్పీటీసీ అభ్యర్థి తిరుమూరు వజ్రమ్మ, ఎంపీటీసీ అభ్యర్థి మల్లిక మంజులమ్మకు మద్దతుగా ఇంటింటి ప్రచారం

కోట, మహానగర్

మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. వెంకన్నపాలెం సర్పంచ్ కోకర్ల మధు యాదవ్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు కలిసి జడ్పీటీసీ అభ్యర్థి తిరుమూరు వజ్రమ్మ, ఎంపీటీసీ అభ్యర్థి మల్లిక మంజులమ్మకు మద్దతుగా శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. వెంకన్నపాలెం, వీరారెడ్డి సత్రం, క్రాస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేసి, సైకిల్ గుర్తుపై ఓటు వేసి తమ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అర్హులైన పేదలకు సామాజిక పింఛన్లు, మహిళలకు ఆర్థిక భరోసా కల్పించే పథకాలు, రైతులకు సహాయం, విద్యార్థులకు ప్రోత్సాహం, గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పెంపు, చంద్రన్న బీమా, అన్న క్యాంటీన్ల వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రస్తావిస్తూ, స్థానిక సమస్యల పరిష్కారంతో పాటు రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. జడ్పీటీసీ



అభ్యర్థి తిరుమూరు వజ్రమ్మ, ఎంపీటీసీ అభ్యర్థి మల్లిక మంజులమ్మకు మద్దతు తెలపాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, వెంకన్నపాలెం గ్రామస్థులు పాల్గొన్నారు.

బియ్యం ధరలకు నియంత్రణకు ప్రభుత్వ చర్యలు

రకాలను బట్టి కిలోకు ధరల ఖరారు

సోనా, సాంబా, కేఎన్ఎం రకాలు రూ.66.. హెచ్ఎంటీ, ఆర్ఎన్ఆర్ రూ.76.. జైశ్రీరామ్ రూ.82

విజయవాడ, మహానగర్

రాష్ట్రంలో బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో వినియోగదారులకు సరసమైన ధరలకు బియ్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా వివిధ రకాల బియ్యానికి గరిష్ఠ రిటైల్ విక్రయ ధరలను (రిటైల్ సేల్ ప్రైస్) ఖరారు చేసింది. బీపీటీ 3291 (సోనా), బీపీటీ 5204 (సాంబా), కేఎన్ఎం రకాల బియ్యం కిలో రూ.66, హెచ్ఎంటీ, ఆర్ఎన్ఆర్ రకాల బియ్యం కిలో రూ.76, జై శ్రీరామ్ రకం కిలో రూ.82, ఎంటీయూ సాధారణ రకాల బియ్యం కిలో రూ.47గా నిర్ణయించింది. ఈ ధరలకు మించి విక్రయించకుండా బియ్యం మిల్లుల యజమానులు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు ప్రభుత్వం నిర్దేశించిన ధరలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించింది. బియ్యం నాణ్యత, కొనుగోలు ధరలను పరిగణనలోకి తీసుకుని ఈ ధరలను నిర్ణయించినట్లు వెల్లడించింది. నిర్ణీత ధరల కంటే అధికంగా ఎంఆర్‌పీ ముద్రించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడరాదని స్పష్టం చేసింది. బియ్యం విక్రయ కేంద్రాల్లో ధరల పట్టికలను ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలని, నిర్ణీత ధరలకు బియ్యం అందుబాటులో ఉండేలా అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని సూచించింది. అధిక ధరలకు బియ్యం విక్రయించే వ్యాపారులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. ప్రజలకు సరసమైన ధరలకు బియ్యం అందుబాటులో ఉండేలా నిర్ణయించిన ధరలను ప్రతి వ్యాపారి తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధం

ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేసేందుకు సమగ్ర ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, వ్యయ పరిశీలకులు బి.విజయ్ కుమార్, వీఎంసీ ధ్యానచంద్ర



విజయవాడ, మహానగర్

నగరపాలక సంస్థతో పాటు జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు సమగ్ర ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. ఎన్నికల జిల్లా వ్యయ పరిశీలకులు బి.విజయ్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం శనివారం విజయవాడ లయోలా కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించారు. పోలింగ్ బృందాలకు అందిస్తున్న ఎన్నికల సామగ్రిని, వివిధ ఫారాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు నాలుగు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 222 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుతంగా వినియోగించుకునేందుకు మొత్తం 1,104 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సెన్సిటివ్, హైపర్ సెన్సిటివ్ కేంద్రాలను గుర్తించామని.. సీసీటీవీ కెమెరాలతో పాటు వెబ్‌కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) మార్గదర్శకాలకు అనుగుణంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు బి.విజయ్ కుమార్ మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు క్రియాశీలంగా పనిచేస్తున్నాయన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ), ఎంసీఎంసీ, అకౌంటింగ్ బృందాలు వంటివి సమష్టి కృషితో పనిచేస్తున్నాయని తెలిపారు. నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు వస్తే వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఎన్నికల నిర్వహణకు చేసిన ఏర్పాట్లను ధ్యానచంద్ర హెచ్ఎం వివరించారు.

ఓటరు గుర్తింపు కోసం

12 రకాల కార్డుల్లో ఏదో ఒకటి తప్పనిసరి

ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

విజయవాడ, మహానగర్



రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన అమూల్యమైన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. నవంబర్ 1వ తేదీన నిర్వహించనున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. ఆరోజు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓటరు జాబితాలో పేరున్న ప్రతి ఒక్కరూ నిర్ణీత సమయంలో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయాలని సూచించారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. పోలింగ్ కేంద్రానికి వెళ్లే ప్రతి ఓటరు ఎన్నికల సంఘం నిర్దేశించిన 12 రకాల ప్రత్యామ్నాయ గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకదాన్ని తప్పనిసరిగా వెంట తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, పాస్‌పోర్ట్, పోస్టాఫీసు పాస్‌బుక్, ఉపాధి హామీ పథకం వేతన జాబ్ కార్డు, హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు, పెన్షన్ డాక్యుమెంట్, సర్వీస్ ఐడెంటిటీ కార్డు, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ (ఎన్‌పీఆర్) స్మార్ట్ కార్డు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డు, వికలాంగుల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదాన్ని చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని జిల్లా కలెక్టర్ వివరించారు.

ఇంట్లో మంట పెట్టనున్న

ఎల్‌నినో!

ఎల్ నినో. ఇపుడు ఈ పదమే భయపెడుతోంది. ఇప్పటిదాకా చూసిన ఎల్ నినో అన్నది ఒక ట్రైలర్ అయితే రానున్న ఆరేడు నెలలలో వచ్చేది సూపర్ ఎల్ నినో అంటున్నారు. అది అత్యంత భయంకరంగా ఉండబోతోంది అని చెబుతున్నారు. ఏకంగా ప్రతీ ఇంట్లో మంట పెట్టనుంది అని అంచనా వేసి మరీ చెబుతున్నారు. పొయ్యి కింద పొయ్యి మీద రెండింటికీ కలిపి ఒకేసారి కరవు తీసుకుని వచ్చే పవర్ ఫుల్ సూపర్ ఎల్ నినోని దేశం చూస్తోంది. ప్రత్యేకించి దక్షిణాది రాష్ట్రాలలో దీని ప్రభావం అత్యధికం అని చెబుతున్నారు. మరి ఇంతలా ఎల్ నినో వచ్చి మీద పడితే ఏమి చేయాలి అంటే చేయాల్సిన విధంగా పొదుపు చర్యలు ఎవరి మటుకు వారు పాటిస్తే తక్కువ నష్టంతో కష్టం తో బయటపడతామని దీని గురించి అంచనా వేస్తున్న వారంతా చెబుతున్నారు ఎల్ నినోతో పాటే వెంట వచ్చేవి నీటి కొరత, అలాగే అధిక వేడిమి, నిత్యావసర ధరలు భారీగా పెరుగుదల. ఇక ఒకదానితో ఒకటి లింక్ అయి ఉన్న ప్రతీ వస్తువూ ఎల్ నినో తో తీవ్రమైన ప్రభావమే చూపిస్తుంది అంటున్నారు. ముందుగా నీటి కొరత అయితే పట్టి పీడిస్తుంది అని అంటున్నారు. భూగర్భ జలాలు దారుణంగా పడిపోవడంతో తాగేందుకు కూడా నీరు ఉండని దారుణమైన పరిస్థితులను అంతా చూడబోతున్నారు అని చెబుతున్నారు. మరి ఈ సమయంలో ఏమి చేయాలి అంటే ఉన్న నీటిని ఇప్పటి నుంచే జాగ్రత్తగా పొదుపు చేసుకోవాలి. రెండు చెంబులు వాడాల్సిన చోట ఒక చెంబు వాడాలి. అలాగే పారబోయడం, నీటిని వృధా చేయడం అసలు చేయరాదు అని అంటున్నారు. ఇక తాగేందుకే నీటి కొరత ఉంటే పంటలకు ఎలా అన్నది పెద్ద ప్రశ్న. అలా పంటలు కూడా పూర్తిగా పండని స్థితి ఉంటుంది. దాంతో అందరూ తినే బియ్యానికి కూడా ఎక్కువగా కొరత ఏర్పడుతుందని చెబుతున్నారు. ఇప్పటికే ఎల్ నినో ప్రభావం అని చూపిస్తూ బియ్యం ధరలను ఎక్కడికక్కడ పెంచేస్తున్నారు. రానున్న ఆరు నెలలలో వీటి ధరలు ఇంకా ఎక్కువగా పెరగవచ్చు అని అంటున్నారు. దాంతో అన్నం ముద్ద ప్రతీదీ ఇపుడు అత్యంత విలువ కాబోతోంది. అనవసరంగా అన్నం పారేయడం అయితే చేయవద్దు అన్నది పెద్దల మాట. ఉన్న ముద్దను జాగ్రత్తగా వాడుకోవడం మరో మంచి మాట. నిత్యావసరాలు అన్నీ కేవలం బియ్యం మాత్రమే కాకుండా నిత్యావసరాలు అన్నీ కూడా అత్యధిక ధరలు పలుకుతాయి. అది సామాన్యుడు కొనలేని స్థితికి వెళ్ళిపోతాయని అంటున్నారు. పప్పుల నుంచి వంట నూనెల నుంచి ఉల్లిపాయలు, చింతపండు, వంట గ్యాస్ నుంచి అన్నీ కూడా ఆకాశాన్ని అంటేలా ధరలు పెరిగిపోతాయని అంటున్నారు. ఇక కూరగాయల ధరలు ఇప్పటికే మార్కెట్ లో అదిరిపోతున్నాయి. ఇవి ఇంకా పెరిగి కిలో వంద రూపాయలు పై దాటినా ఆశ్చర్యం లేదని అంటున్నారు. విద్యుత్ కొరత : విద్యుత్ అన్నది ఎలా తయారవుతుంది అంటే నీటి నుంచే ఎక్కువ అన్నది తెలిసిందే. పైగా ఇది చవక అయినది కూడా. మరి నీరే లేని చోట విద్యుత్ ఉత్పత్తి భారీగా తగ్గిపోతుంది. దాంతో తీవ్రమైన విద్యుత్ కొరత ఏర్పడుతుంది అని అంటున్నారు. అందుకే ఇప్పటి నుంచే కరెంట్ ని కూడా పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి. ఎక్కువగా ఫ్యాన్లు ఏసీలు లైట్లూ వేసి వృధా చేస్తే రేపటి రోజున విద్యుత్ ఉండని నేపథ్యం ఉంటుంది. వస్తుంది కదా కరెంట్ అని ఈ రోజు ఖర్చు చేయడం కాదు తగ్గిస్తే అదే రేపటికి మనకు వెలుగు ఇస్తుంది అన్నది గుర్తెరగాలి.ఇక సూపర్ ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అనవసర ఖర్చులను అదుపు చేయాలని సూచిస్తున్నారు. వేయి రూపాయలు ఖర్చు చేయాల్సిన చోట అయిదు వందలకే పరిమితం కావాలి. విలాసం ఏదో అవసరం ఏదో గుర్తించి ఆ విధంగా మసలుకోవాలని అంటున్నారు. ఎందుకంటే పెరిగే ధరలతో డబ్బు విలువ అమాంతం పడిపోతుంది. వందకు వచ్చేది రెండు వందలకు ఎగబాక వచ్చు. అపుడు నిత్యావసరాలకే ఎక్కువ బడ్జెట్ అవుతుంది. కాబట్టి చేతిలో డబ్బు ఉంచుకోవాలి. అది ప్రాణప్రదంగా ఖర్చు చేయాలని సూచిస్తున్నారు. అయితే సూపర్ ఎల్ నినో అని భయపడి వణికిపోయి ఇప్పుడే మొత్తం సరుకులు అన్నీ కొనేసి ఇంట్లో వేసుకున్నా కూడా అది కూడా తప్పే అవుతుంది. ఎందుకంటే డిమాండ్ అండ్ సప్లై చైన్ తో సాగే ప్రపంచంలో ఈ విధంగా తొందర పడితే మరింతగా ధరలు పెరిగి ఆ ప్రభావం ఇతర వస్తువుల మీద కూడా పడుతుంది. అందువల్ల జాగ్రత్తగా వ్యవహరిస్తే చాలు, అందరూ సూపర్ ఎల్ నినోని తట్టుకుని బయటపడతారని అంటున్నారు. వచ్చే ఆరు నెలలు గడిస్తే మాత్రం మంచి రోజులు వచ్చినట్లే అని అంటున్నారు. తస్మాత్ జాగ్రత్త.

అభివృద్ధి అంటే ఆర్భాటం కాదు..

ప్రజల జీవితాల్లో మార్పు!



దేశం అభివృద్ధి చెందుతోందని చెప్పడానికి భారీ భవనాలు, విశాలమైన రహదారులు, ఆకాశహర్మ్యాలు మాత్రమే కొలమానాలు కావు. సామాన్యుడి జీవన ప్రమాణాలు మెరుగుపడినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. ప్రతి కుటుంబానికి నాణ్యమైన విద్య, అందుబాటులో వైద్యం, ఉపాధి అవకాశాలు, తాగునీరు, మెరుగైన రవాణా సదుపాయాలు అందినప్పుడే అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేరినట్లు భావించాలి.

ప్రభుత్వాలు మారుతున్నాయి.. పాలకులు మారుతున్నారు.. కొత్త పథకాలు, కొత్త హామీలు తెరపైకి వస్తున్నాయి. కానీ సామాన్యుడి జీవితంలో ఎదురయ్యే సమస్యలు మాత్రం పూర్తిగా పరిష్కారం కావడం లేదు. విద్య, వైద్యం, ఉపాధి వంటి మౌలిక అంశాలపై ప్రభుత్వాలు మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత కార్యాచరణలో కనిపించాలి. ప్రజాధనంతో చేపట్టే ప్రతి కార్యక్రమానికి జవాబుదారీతనం ఉండాలి.

నేటి సమాజంలో విద్య ఖరీదైన వ్యవహారంగా మారుతోంది. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల భారం మధ్యతరగతి కుటుంబాలను ఆర్థికంగా కుంగదీస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ఉపాధ్యాయుల కొరత వంటి సమస్యలు పరిష్కారం కావాలి. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వాల ప్రథమ బాధ్యతగా ఉండాలి. అలాగే వైద్యం సామాన్యుడికి అందని భారంగా మారకుండా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయాలి.

మరోవైపు నిరుద్యోగం యువతను తీవ్రంగా వేధిస్తోంది. ఉన్నత చదువులు పూర్తి చేసినప్పటికీ తగిన ఉద్యోగాలు లభించక ఎంతోమంది నిరాశకు గురవుతున్నారు. ఉద్యోగాల భర్తీతో పాటు పరిశ్రమల స్థాపన, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధికి ప్రోత్సాహం అవసరం. వ్యవసాయ రంగాన్ని కూడా నిర్లక్ష్యం చేయకూడదు. రైతుకు గిట్టుబాటు ధర, సాగునీరు, నాణ్యమైన విత్తనాలు, అవసరమైన సమయంలో పెట్టుబడి సాయం అందాలి.

అభివృద్ధి పేరుతో చేసే ప్రతి ఖర్చు ప్రజలకు ఉపయోగపడుతోందా లేదా అన్నది పరిశీలించాలి. ప్రాజెక్టులు ప్రారంభించడం ఎంత ముఖ్యమో, వాటిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం అంతకంటే ముఖ్యం. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత ఉండాలి. అవినీతి, జాప్యం, రాజకీయ జోక్యానికి తావులేకుండా పాలన సాగాలి. ప్రజాస్వామ్యంలో ప్రజలే పాలకులకు అసలైన జవాబుదారీ వ్యవస్థ. ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించడం, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, హక్కుల కోసం గొంతెత్తడం ప్రజల బాధ్యత. అదే సమయంలో ప్రజల ఆకాంక్షలను గౌరవించి, విమర్శలను స్వీకరించి, తప్పులను సరిదిద్దుకోవడం పాలకుల బాధ్యత.

అధికారంలో ఎవరు ఉన్నారన్నది కాదు.. ప్రజల జీవితాల్లో ఎంతటి మార్పు తీసుకొచ్చారన్నదే పాలనకు అసలైన కొలమానం. అభివృద్ధి ప్రచారంలో కాదు.. ప్రజల అనుభవంలో కనిపించాలి!

ప్రజలకు కావాల్సింది వాగ్దానాల వర్షం కాదు.. సమస్యలకు శాశ్వత పరిష్కారం. ప్రారంభోత్సవాల ఆర్భాటం కాదు.. పూర్తయిన పనుల ఫలితం. ప్రచారంలో కనిపించే అభివృద్ధి కాదు.. ప్రతి ఇంటి గడపలో అనుభూతి చెందే మార్పు. ప్రజాధనంతో పాలన సాగించే ప్రతి ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. అధికారం అనేది హోదా కాదు.. ప్రజలకు సేవ చేసే బాధ్యత. ఈ సత్యాన్ని పాలకులు గుర్తించినప్పుడే ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థం, అభివృద్ధికి అసలైన పరమార్థం సిద్ధిస్తాయి. ప్రజల బతుకులు మారనప్పుడు ఎంతటి అభివృద్ధి గణాంకాలైనా నిరర్థకమే.. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపినప్పుడే అది నిజమైన ప్రగతి!

ధరల రోగానికి ఇదా చికిత్స!?



నియంత్రించాల్సిన వ్యవస్థలు నోరుమూసుకుంటే, పర్యవేక్షణ చేయాల్సిన ప్రభుత్వం పట్టనట్టుంటే జరిగేదేమిటో ప్రాణాంతక కేన్సర్ వ్యాధికి వాడే ఔషధాల ధరలు చుక్కలనంటడం చూస్తే స్పష్టంగా అర్థమవుతుంది. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వమూ, జాతీయ ఔషధ ధరల ప్రాధికార సంస్థ (ఎన్‌పీపీఏ) ప్రదర్శిస్తున్న అంతులేని నిర్లక్ష్యాన్ని సర్వోన్నత న్యాయస్థానం మొన్న మంగళవారం తీవ్రంగా దుయ్యబట్టాక ఆ వెంటనేకొంత కదలిక వచ్చిన జాడలు కనబడ్డాయి. అంతక్రితమే సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణ సాగుతుండగా ఎంపికచేసిన 137 ఔషధాల గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ)పై నియంత్రణ విధిస్తూ కేంద్రం ఆదేశాలిచ్చింది. వచ్చే నెల 9నుంచి అమల్లోకొచ్చేలా వీటి ధరలు తగ్గించామని ఉత్పత్తిదారులు ప్రకటించారు. మంచిదే. అయితే మొత్తం 543 కేన్సర్ ఔషధ రకాల్లో వీటి సంఖ్య ఏపాటి? చావు కబురు చల్లగా చెప్పినట్టు పేటెంటు, లైసెన్సు, ఇతర రకాల పరిరక్షణ వ్యవస్థల పరిధిలోకొచ్చే ఔషధాలకు మాత్రం ఈతగ్గింపు వర్తించదంటున్నారు ఉత్పత్తిదారులు.

ప్రజలందరి మేలూ కోరే ఆర్థిక వ్యవస్థ లేనిచోట నిరుద్యోగం, పేదరికం, అజ్ఞానం, అనారోగ్యంవంటి సమస్త రుగ్మతలూ ముసురుకుంటాయని కెనడాకు చెందిన ప్రజా వైద్యుడు డాక్టర్ నార్మన్ బెతూన్ చెప్పి దశాబ్దాలు దాటుతోంది. దాదాపు అన్ని ప్రభుత్వాలూ తమ ఆచరణ ద్వారా ఆయన చెప్పింది నూరుశాతం నిజమని నిరూపి స్తున్నాయి. ఉదాహరణకు ఊపిరితిత్తులతోపాటు పలు ఇతర కేన్సర్లకు వాడే మెర్క్‌కంపెనీ ఔషధం వంద మిల్లీగ్రాముల టీకా ధర రూ. 2.16 లక్షలు. ఇంత ధర వెచ్చించటం సాధారణ రోగులకు సాధ్యమేనా? 21 మాత్రలుగా ఉండే ఇమ్యూనోథెరపీ ఔషధం200 మిల్లీగ్రాముల ధర రూ. 24,435. ఈ రెండు రకాల ఔషధాలూ జాబితాలో లేవు. ఇవేకాదు... రూ. 10 లక్షల ఖరీదుచేసే మరో ఔషధం కూడా జాబితాలో గల్లంతయింది! అలాగే చాలావాటి ధరలు స్వల్పంగా... అంటే రూ. 100లోపే తగ్గాయి. రొమ్ము, ప్రోస్టేట్ తదితర కేన్సర్లకు వినియోగించే నాలుగైదు రకాల ఔషధాలు మాత్రం గణనీయంగా తగ్గాయి. ఉదాహరణకు కీమోథెరపీలో వాడే ఔషధం ధర రూ. 80,071 నుంచి రూ. 7,150కి, రొమ్ము కేన్సర్‌కు వాడే ఔషధం ధర రూ. 40,421 నుంచి రూ. 2,720కి, బహుళ కేన్సర్లకు వాడే ఔషధం ధర రూ. 69,852 నుంచి రూ. 13,512కు తగ్గాయి.

అసలు ఎంఆర్‌పీపై నియంత్రణ సరిపోతుందనుకోవటమే లోపభూయిష్టం.తగ్గించామని ఘనంగా చెప్పుకున్నంతసేపు పట్టదు అవి పెరగటానికి. ముడి సరుకుల ధరలు పెరిగితే అవి పైపైకి పోతాయి. చాలా రకాల ఔషధాలకు లక్షల రూపాయల ధర పెట్టడం వెనక అవి ప్రాణరక్షణకు ప్రభావవంతంగా తోడ్పడటంతప్ప మరేవిధమైన హేతుబద్ధతా లేదు. ఉత్పత్తిదారుల దగ్గర ధరను నియంత్రిస్తే వేరు. ఉదాహరణకు ఒక ఔషధ తయారీకయ్యే వ్యయానికి ఉత్పత్తిదారులు 42.8 శాతం అదనంగా వేసుకుని స్టాకిస్టులకు విక్రయిస్తారు. రోగులకెళ్లేలోగా మరిన్ని అంచెలుంటాయి. కొన్ని సందర్భాల్లో ఆస్పత్రులే నేరుగా కొని విక్రయిస్తాయి. ఈ క్రమంలో ప్రతిచోటా అదనపు లాభం వేసుకుంటూపోతారు. ఎంఆర్‌పీపై కేంద్రీకరిస్తే ఈ లాభార్జన స్వల్పంగా తగ్గుతుంది. ఆస్పత్రులైతే మందులపై 'కోల్పోయిన' దాన్ని గది అద్దె పెంచటంద్వారానో, మరో రకంగానో వసూలు చేస్తాయి. గతంతో పోలిస్తే కేన్సర్ మహమ్మారి విస్తృతి పెరిగింది. గ్రామాలు, నగరాలన్న తేడా లేకుండా అందరినీ కాటేస్తోంది. కారణాలు అందరికీ తెలుసు. సాగులో ఎరువులవాడకం, అధిక పాల ఉత్పత్తి కోసం పశువులకు విచక్షణారహితంగా ఇంజెక్షన్లివ్వటం, వాతావరణ కాలుష్యం, నదులు, భూగర్భ జలాల కాలుష్యం, ప్రమాదకరమైన ఆహార విక్రయాలు... ఇవన్నీ కేన్సర్ కారకాలు. సారాంశంలో ప్రభుత్వ విధానాలు కావొచ్చు... వాటి నిర్ల?్యపకత కావొచ్చు... ఈ ప్రాణాంతక వ్యాధికి మూలం. ప్రత్యక్షంగాలేదా పరోక్షంగా తామే ఈ మరణమృదంగానికి కారణమవుతూ... కనీసం ఔషధాల ధరలైనా సరిగా నియంత్రించలేనప్పుడు ప్రభుత్వాలుండి ఏం ప్రయోజనం? అందుకేకంటితుడుపు చర్యలు మానుకుని వాస్తవంగా జనానికి లబ్ధి చేకూరే విధానాలు అమల్లోకి తీసుకురావాలి.

ఇస్రో ప్రయోగం సక్సెస్

న్యూఢిల్లీ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఖాతాలో మరో అద్భుత విజయం చేరింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలో ఉన్న సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్ ద్వారా ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల బృందాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. "జీఎస్ఎల్వీ-ఎఫ్18 ద్వారా ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు నా అభినందనలు. మన స్వదేశీ నావిగేషన్ వ్యవస్థ 'నావిక్'ను బలోపేతం చేయడంలో ఈ ప్రయోగం ఒక ముఖ్యమైన ముందడుగు" అని ఆయన పేర్కొన్నారు. అత్యాధునిక సామర్థ్యాలతో కూడిన ఈ ఉపగ్రహం, కీలక సాంకేతికతల్లో దేశం ఆత్మనిర్భరత సాధించేందుకు మరింత దోహదపడుతుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన నావిగేషన్ సేవలు అందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. మన అంతరిక్ష శాస్త్రవేత్తల అంకితభావం, నైపుణ్యం దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నాయని మోదీ కొనియాడారు. 'నావిగేషన్ విత్ ఇండియన్ కాన్‌స్టలేషన్' (నావిక్) అనేది భారత్ సొంతంగా అభివృద్ధి చేసుకున్న ప్రాంతీయ నావిగేషన్ వ్యవస్థ. అమెరికాకు చెందిన జీపీఎస్ తరహాలోనే ఇది పనిచేస్తుంది. దేశ భద్రత, రవాణా, విపత్తుల నిర్వహణ, పౌర సేవలు వంటి అనేక రంగాల్లో కచ్చితమైన పొజిషనింగ్, టైమింగ్ సేవలను అందించడం దీని లక్ష్యం. ప్రస్తుతం ప్రయోగించిన ఎన్‌వీఎస్-03, నావిక్ కోసం రూపొందించిన రెండో తరం ఉపగ్రహాల్లో ఒకటి. ఇది నావిక్ వ్యవస్థకు మరింత శక్తిని అందించి, దాని సేవలను మరింత విస్తృతం చేయనుంది. ఈ ఉపగ్రహంలో స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన అటామిక్ క్లాక్ ఉండటం విశేషం. ఈ విజయంతో అంతరిక్ష రంగంలో స్వావలంబన దిశగా భారత్ మరో కీలక ముందడుగు వేసినట్లయింది.

భారత వ్యతిరేక శక్తుల కుట్ర!

ఏక్తానగర్: దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నిస్తున్న భారత వ్యతిరేక శక్తుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. దేశంలో విభజనను ప్రోత్సహించేందుకు కొన్ని శక్తులు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. సామాజిక మాధ్యమాల వేదికగా అబద్ధాలు, వదంతులను వ్యాప్తి చేస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టించి, దేశంలో అస్థిరతకు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. దేశ ప్రజలంతా ఐక్యంగా ఉండాలని, జాతీయ సమైక్యతే భారతదేశానికి అతిపెద్ద బలమని స్పష్టం చేశారు.

ఐక్యతే దేశానికి రక్షణ కవచం!

ప్రపంచవ్యాప్తంగా రాజకీయ ఉద్రిక్తతలు, ఇంధన సంక్షోభం నెలకొన్నప్పటికీ భారత పౌరులపై వాటి ప్రభావం పడకుండా సమర్థంగా ఎదుర్కొన్నామని మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలోని పలు దేశాల్లో పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లపై ఆంక్షలు విధించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని గుర్తుచేశారు. భారీ జనాభా, పరిమిత స్వదేశీ పెట్రోలియం ఉత్పత్తి ఉన్న భారత్‌లోనూ తీవ్ర సంక్షోభం తలెత్తుతుందని గతంలో అంచనాలు వెలువడ్డాయని చెప్పారు. అయితే దేశ ప్రజల సహకారం, ప్రభుత్వ సమర్థవంతమైన చర్యలతో సంక్షోభాన్ని ఎదుర్కోగలిగామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అస్థిర పరిస్థితులు నెలకొన్న వేళ భారతీయుల ఐక్యతే దేశానికి



అతిపెద్ద రక్షణ కవచమని ఉద్ఘాటించారు.

పేదరికంపై గత పాలకులపై విమర్శలు

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశంలో పేదరిక నిర్మూలన గురించి చర్చలు జరుగుతూనే ఉన్నాయని ప్రధాని మోదీ అన్నారు. పేదరికాన్ని తొలగిస్తామని హామీలిచ్చి గతంలో పలువురు ఎన్నికల్లో ఓట్లు అడిగారని విమర్శించారు. పేదరిక నిర్మూలన నినాదాలు చేసినవారు వ్యక్తిగతంగా మరింత సంపన్నులయ్యారని వ్యాఖ్యానించారు. అయితే ప్రస్తుతం భారత్ అపూర్వమైన శక్తి, దృఢ సంకల్పంతో ముందుకు సాగుతోందని, ప్రజల్లో పెరుగుతున్న ఆత్మవిశ్వాసమే దేశ పురోగతికి ప్రధాన బలమని పేర్కొన్నారు.

ఉక్కుమనిషికి ఘన నివాళులు

ఉక్కుమనిషి, భారత మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ ఘనంగా నివాళులర్పించారు. గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో ఉన్న స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద పటేల్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. దేశ సమగ్రత, ఐక్యత, జాతి నిర్మాణం కోసం పటేల్ చేసిన సేవలను కొనియాడారు. దృఢమైన, సంపన్నమైన, సమర్థవంతమైన భారతదేశ నిర్మాణానికి ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న సాయుధ దళాల పరేడ్

పటేల్‌కు నివాళులర్పించిన అనంతరం ఏక్తానగర్‌లో సాయుధ దళాల పరేడ్ అట్టహాసంగా నిర్వహించారు. నర్మదా మాత విగ్రహం నుంచి రెప్లికా గార్డెన్ వరకు సాగిన ఈ కవాతులో సుమారు 10 వేల మంది పోలీసు, పారామిలటరీ సిబ్బంది పాల్గొన్నారు. వాయుసేన నిర్వహించిన ఫ్లైపాస్ట్, భద్రతా బలగాల మోటార్ సైకిల్ విన్యాసాలు, డాగ్ స్క్వాడ్ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మార్షల్ ఆర్ట్స్, అశ్వ, ఒంటె దళాల కవాతు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 4,700 మంది కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భారతీయ సంస్కృతి, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పాయి.

సీఈసీపై ఇండీ కూటమి బహిరంగ అభిశంసన!

దిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలిపై కాంగ్రెస్ సహా ఇండీ కూటమి తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఆయనకు వ్యతిరేకంగా 'బహిరంగ ప్రజా అభిశంసన' తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. శనివారం దిల్లీలో రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే అధికారిక నివాసంలో లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షతన మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం పనితీరు, ఎస్ఐఆర్ ప్రక్రియ, ఎన్నికల కమిషనర్ల నియామక చట్టంపై ప్రతిపక్ష నేతలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

మోదీ, అమిత్ షా ఆదేశాలతోనే పనిచేస్తున్నారు!

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశాల మేరకే సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల సంఘాన్ని నడుపుతున్నారని ఖర్గే ఆరోపించారు. దీనివల్ల సామాన్యుల ఓటు హక్కు ప్రమాదంలో పడిందని విమర్శించారు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, రాజ్యాంగబద్ధ సంస్థ గౌరవాన్ని కాపాడాలన్నదే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు. సీఈసీపై వ్యక్తిగత విద్వేషం లేదని, ఆయన పనితీరుపైనే తమ అభ్యంతరాలని పేర్కొన్నారు.

2023 చట్టాన్ని రద్దు చేయాలి

ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించి 2023లో తీసుకొచ్చిన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని ఖర్గే డిమాండ్



చేశారు. ఆ చట్టం సీఈసీకి విస్తృతమైన రక్షణ కల్పిస్తోందని విమర్శించారు. రాష్ట్రపతికి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కూడా లేని స్థాయి రక్షణను సీఈసీకి కల్పించారని ఆరోపించారు. ఈ చట్టం ఆమోదం పొందిన సమయంలో 145 మంది ప్రతిపక్ష ఎంపీలను పార్లమెంటు నుంచి సస్పెండ్ చేశారని గుర్తుచేశారు.

14 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపణ

ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 14 కోట్ల మంది ఓటర్ల పేర్లను ఉద్దేశపూర్వకంగా తొలగించారని ఖర్గే ఆరోపించారు. అక్రమంగా తొలగించిన ఓట్లను తిరిగి పునరుద్ధరించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత ఉండాలంటే భవిష్యత్తులో అన్ని ఎన్నికలను బ్యాలెట్ పేపర్ల ద్వారానే నిర్వహించాలని ఇండీ కూటమి కోరుతోందని తెలిపారు.

ఓటు హక్కును కాపాడాలి

18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం ద్వారా యువతకు దేశ భవిష్యత్తును నిర్ణయించే అవకాశం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ కల్పించారని ఖర్గే గుర్తుచేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ హక్కును బలహీనపరిచే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. తాము చొరబాటుదారుల కోసం ఓటు హక్కును కోరడం లేదని, భారత పౌరులందరి రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును పరిరక్షించాలన్నదే తమ డిమాండ్ అని స్పష్టం చేశారు.

ఇందిరా గాంధీకి నివాళులు

మాక్ పార్లమెంట్ సమావేశానికి ముందు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా ఖర్గే నివాళులర్పించారు. లోక్‌సభను తలపించేలా ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి నిర్వహించిన ఈ సమావేశానికి వివిధ రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, ఇండీ కూటమి నేతలు, ప్రతిపక్ష ఎంపీలు హాజరయ్యారు.

దిల్లీ మార్చ్‌కు రాహుల్ పిలుపు!


దిల్లీ: దేశ రాజధానిలో రాజకీయ వేడి రాజుకుంటోంది. ఎన్నికల సంఘం పనితీరు, ఓటు హక్కుల పరిరక్షణ అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేయాలని ఇండీ కూటమి నిర్ణయించింది. ఇందులో భాగంగా నవంబర్ 1న దిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ ర్యాలీలో రాజకీయ పార్టీలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. అయితే మార్చ్‌కు అనుమతి లేదని దిల్లీ పోలీసులు ప్రకటించడంతో రాజకీయంగా ఉత్కంఠ నెలకొంది.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే పోరాటం

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఎన్నికల సంఘం కలిసి భారత ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ పరిణామాలకు నిరసనగా ప్రజలంతా ఉద్యమంలో భాగస్వాములు కావాలని తన ఎక్స్ ఖాతా ద్వారా పిలుపునిచ్చారు. నవంబర్ 1న మధ్యాహ్నం 12 గంటలకు కన్నాట్ ప్లేస్--మింటో రోడ్ జంక్షన్ నుంచి మార్చ్ ప్రారంభమై రామ్‌లీలా మైదానం వరకు కొనసాగుతుందని వెల్లడించారు. ర్యాలీలో పాల్గొనేందుకు ప్రజలు దిల్లీకి రాకుండా అడ్డుకునేందుకు అమిత్ షా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

మార్చ్‌కు అనుమతి లేదన్న పోలీసులు

రాహుల్ గాంధీ ప్రకటనపై స్పందించిన దిల్లీ పోలీసులు.. కన్నాట్ ప్లేస్ నుంచి మార్చ్ నిర్వహించేందుకు తమకు ఎలాంటి దరఖాస్తు అందలేదని స్పష్టం చేశారు. అయితే



ఎంపీలు, రాజకీయ నాయకులు తమ వ్యక్తిగత వాహనాల్లో కాన్‌స్టిట్యూషన్ క్లబ్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసానికి వెళ్లేందుకు అభ్యంతరం లేదని తెలిపారు. గతంలో నిరసనలకు వేదికగా ఉన్న జంతర్ మంతర్‌లో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

దిల్లీలో భారీ భద్రత.. ట్రాఫిక్ మళ్లింపులు

ఇండీ కూటమి ర్యాలీ నేపథ్యంలో దిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. రామ్‌లీలా మైదానం పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. సెంట్రల్ దిల్లీ పోలీసు విభాగాలతో పాటు అదనపు పారామిలటరీ బలగాలను మోహరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పలు కీలక మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నారు. నేతాజీ సుభాష్ మార్గ్, రాజ్‌ఘాట్, దిల్లీ గేట్, ఐటీఓ, అజ్మేరీ గేట్, రంజీత్ సింగ్ ఫ్లైఓవర్, ఝండేవలన్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టనున్నారు. రైలు ప్రయాణికులు ముందస్తుగా తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని పోలీసులు సూచించారు.

ఎన్ని అడ్డంకులొచ్చినా ర్యాలీ నిర్వహిస్తాం

ఇండీ కూటమి ర్యాలీకి దేశవ్యాప్తంగా ప్రజలు తరలివస్తున్నారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ర్యాలీ నిర్వహించి తీరుతామని స్పష్టం చేశారు. దేశం నలుమూలల నుంచి ప్రజలు దిల్లీకి బయలుదేరారని, ఇప్పటివరకు దిల్లీ చూసిన అతిపెద్ద ర్యాలీల్లో ఇది ఒకటిగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

అభిశంసన నోటీసు తిరస్కరణపై ఆగ్రహం

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన తీర్మానానికి సంబంధించిన నోటీసును తిరస్కరించడంపై వేణుగోపాల్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వంద మందికి పైగా పార్లమెంటు సభ్యులు సంతకాలు చేసిన నోటీసును కనీసం పరిశీలనకు స్వీకరించాల్సిందని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ప్రకటనపైనా స్పందిస్తూ, ప్రతిపక్షాల డిమాండ్లను ఎందుకు ముందుకు తీసుకెళ్లడం లేదని ప్రశ్నించారు.

ఖైబర్ పఖ్తుంఖ్వాపై పాక్ సైన్యం కన్ను.. ఖనిజ సంపదే లక్ష్యమా?

పాకిస్థాన్ సైన్యం అనుసరిస్తున్న కఠిన వైఖరి, ముఖ్యంగా ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో జరుగుతున్న పరిణామాలు తీవ్ర ఆందోళనలకు దారితీస్తున్నాయి. బలప్రయోగంతోనే తిరుగుబాట్లను అణచివేయవచ్చనే ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ 'హార్డ్-స్టేట్' సిద్ధాంతం ఇప్పుడు ఈ ప్రావిన్స్‌లో పరీక్షకు నిలిచింది. అయితే, ఈ చర్యల వెనుక అసలు లక్ష్యం ప్రావిన్స్‌లోని అపారమైన ఖనిజ సంపదను చేజిక్కించుకోవడమేనని అంతర్జాతీయ నివేదికలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. 'గ్రీక్ సిటీ టైమ్స్' ప్రచురించిన ఒక కథనం ప్రకారం.. ఖైబర్ పఖ్తుంఖ్వాలో ఎన్నికైన ప్రభుత్వాన్ని అకస్మాత్తుగా రద్దు చేసి, ఎమర్జెన్సీ విధించడం వెనుక పెద్ద వ్యూహం ఉందని తెలుస్తోంది. అక్టోబర్ 11న రాజ్యాంగంలోని ఆర్టికల్ 232, 234 కింద అత్యవసర అధికారాలను ఉపయోగించి ఫెడరల్ ప్రభుత్వం ప్రావిన్స్‌లో గవర్నర్ పాలన విధించింది. ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిదిని కస్టడీలోకి తీసుకుంది.



పాకిస్థాన్ 18వ రాజ్యాంగ సవరణ ప్రకారం ఖనిజాలు ప్రావిన్సుల ఆధీనంలో ఉంటాయి. తాజా చర్యలతో ప్రావిన్షియల్ అసెంబ్లీ రద్దవడంతో, ఖనిజాలపై ఫెడరల్ ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ లభించినట్లయింది. దాదాపు 4 కోట్ల జనాభా, బలమైన రాజకీయ వ్యవస్థ, ఇప్పటికే కొనసాగుతున్న సాయుధ తిరుగుబాటు, పొరుగునే శత్రుదేశంగా భావించే ఆఫ్ఘనిస్థాన్‌తో సరిహద్దు వంటి క్లిష్టమైన పరిస్థితులున్న ఖైబర్ పఖ్తుంఖ్వాలో సైనిక వ్యూహం బెడిసికొట్టే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భద్రతా వైఫల్యాల కారణంగానే ఎమర్జెన్సీ విధించామని ఇస్లామాబాద్ చెబుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. 2026 ప్రథమార్ధంలోనే 122 మంది పోలీసులు మరణించగా, హింసాత్మక ఘటనలు గణనీయంగా పెరిగాయి. ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చివేయడం, ముఖ్యమంత్రిని అరెస్ట్ చేయడం, ప్రావిన్స్ వనరులను కేంద్రం, విదేశీ కొనుగోలుదారులకు అప్పగించే ప్రయత్నం చేయడం వంటి చర్యలు తీవ్రవాద గ్రూపులకు కొత్త ఆయుధాన్ని అందించినట్లే అవుతుందని ఆ నివేదిక హెచ్చరించింది. ఇది ఖైబర్ పఖ్తుంఖ్వాను కూడా బలూచిస్థాన్ లాగా పాలనారహిత ప్రాంతంగా మార్చే ప్రమాదం ఉందని, ఖనిజాల ద్వారా వచ్చే ఆదాయం కంటే భద్రతాపరమైన నష్టమే ఎక్కువగా ఉంటుందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బంగాళాఖాతంలో కొత్త వాయుగుండం

బంగాళాఖాతంలో మరో తుపాను రూపుదిద్దుకుంటోంది. అర్నబ్ తుపాను తీరం దాటిన కొద్ది రోజులకే, ఆగ్నేయ బంగాళాఖాతంలో మేఘాలు దట్టంగా ఏర్పడి ఒక వ్యవస్థగా మారుతున్న దృశ్యాలను ఇస్రోకు చెందిన ఇన్ శాట్-3డీఎస్ శాటిలైట్ శనివారం ఉదయం గుర్తించింది. ఈ వ్యవస్థ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదులుతుండటంతో అధికారులు దీనిని నిశితంగా గమనిస్తున్నారు. అక్టోబర్ 29న దక్షిణ అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనంగా మొదలైన ఈ వ్యవస్థ, పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతోంది. అక్టోబర్ 31 సాయంత్రం నాటికి ఇది వాయుగుండంగా బలపడింది. రానున్న రెండు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదిలే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేస్తోంది. తాజా శాటిలైట్ చిత్రాల్లో ఒక సుడిలాగా వాయుగుండం స్పష్టంగా కనిపిస్తోంది. దీని ప్రభావంతో దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ దీవుల్లో, ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడవచ్చని, ఆ సమయంలో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. అయితే, ప్రస్తుతానికి పోర్టులకు ఎలాంటి హెచ్చరికలు జారీ చేయలేదు.

అఖండ భారత రూపశిల్పికి ఘన నివాళి!

ఏక్తానగర్/దిల్లీ: అఖండ భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ఉక్కుమనిషి, మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా ఘన నివాళులు అర్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో ఉన్న స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద పటేల్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. దేశ సమగ్రత, ఐక్యత, జాతి నిర్మాణం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు ప్రముఖులు కూడా పటేల్‌కు నివాళులర్పించారు.

దేశ నిర్మాణానికి జీవితాన్ని అంకితం చేశారు: మోదీ

సర్దార్ వల్లభాయ్ పటేల్ బలమైన భారతదేశ నిర్మాణానికి తన జీవితాన్ని అంకితం చేశారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దేశ సేవలో ఆయన చేసిన త్యాగం, చూపిన అంకితభావం ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి స్ఫూర్తిగా నిలుస్తాయని ఎక్స్ వేదికగా వెల్లడించారు. అఖండ భారత నిర్మాత, జాతి ఉక్కుమనిషికి హృదయపూర్వక వందనాలు సమర్పిస్తున్నట్లు తెలిపారు.

ఆధునిక భారత రూపశిల్పి: రాష్ట్రపతి ముర్ము

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి భవన్‌లోని గణతంత్ర మండపంలో పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఆధునిక భారతదేశ ప్రధాన రూపశిల్పిగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. దేశంలోని సంస్థానాల ఏకీకరణతో పాటు పటిష్టమైన పరిపాలనా వ్యవస్థ ఏర్పాటులో పటేల్ చారిత్రాత్మక పాత్ర పోషించారని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రతకు ఆయన చేసిన సేవలకు గుర్తుగా ప్రతి ఏటా అక్టోబర్ 31న జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. పటేల్ జీవితం, ఆదర్శాల నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాలని పిలుపునిచ్చారు.

దేశాన్ని ఏకం చేసిన మహానేత: అమిత్ షా

సంస్థానాలుగా విడిపోయిన దేశాన్ని తన దూరదృష్టితో ఏకం చేసి బలమైన భారతదేశానికి పటేల్ పునాది వేశారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కొనియాడారు. అఖిల భారత సర్వీసుల ఏర్పాటుతో దేశ పరిపాలనా వ్యవస్థకు పటిష్టమైన పునాది వేశారని గుర్తుచేశారు. ఖేడా, బర్డోలీ సత్యాగ్రహాల ద్వారా రైతుల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం ప్రజాసేవకు గొప్ప ఉదాహరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలకే అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చిన పటేల్ త్యాగం, దేశభక్తి ప్రతి పౌరుడికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్ నిర్మాణంలో ఆయన ఆశయాలు మార్గదర్శకంగా నిలుస్తాయని ఎక్స్ వేదికగా సందేశమిచ్చారు.

దిల్లీలో ప్రముఖుల పుష్పాంజలి

పటేల్ జయంతి సందర్భంగా దిల్లీలోని సర్దార్ పటేల్ చౌక్‌లో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ తరణ్‌జిత్ సింగ్ సంధు, ముఖ్యమంత్రి రేఖా గుప్తా, బీజేపీ ఎంపీ బాన్సురి స్వరాజ్ తదితరులు పుష్పాంజలి ఘటించారు. దేశ సమైక్యత కోసం పటేల్ చేసిన కృషిని స్మరించుకున్నారు. ఆయన జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా నిర్వహిస్తూ దేశ ప్రజల్లో సమైక్యతా భావాన్ని చాటిచెబుతున్నారు.

ఇంధన సరఫరాలో ఆంక్షలు.. అడ్డంకులు వద్దు!

అట్లాంటా: ప్రపంచ ఇంధన సరఫరాలో ఆంక్షలు, రవాణా మార్గాల్లో అడ్డంకులు సృష్టించడంపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. చమురు, సహజ వాయువు సరఫరాలో అంతరాయాలు కలిగించడం, ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు చేయడం వల్ల అంతర్జాతీయ మార్కెట్లలో అస్థిరత పెరుగుతోందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన వాణిజ్యాన్ని తమకు అనుకూలంగా మలుచుకునేందుకు కొన్ని దేశాలు వ్యూహాత్మక చర్యలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. అమెరికాలోని అట్లాంటాలో జరిగిన జీ20 విదేశాంగ మంత్రుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

సరఫరాలో అనిశ్చితి.. ధరల్లో అస్థిరత

ప్రపంచం ప్రస్తుతం ఇంధన ఉత్పత్తి కొరత కంటే సరఫరాలో అనిశ్చితి, అంతరాయాలు, ధరల పెరుగుదల వంటి సమస్యలను ఎదుర్కొంటోందని జైశంకర్ పేర్కొన్నారు. ఆంక్షలు, కీలక రవాణా మార్గాల్లో అడ్డంకుల కారణంగా ఇంధన మార్కెట్లలో తరచూ ఒడిదుడుకులు ఏర్పడుతున్నాయని తెలిపారు. వీటి ప్రభావం ముఖ్యంగా తక్కువ ఆదాయ దేశాలపై అధికంగా పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన మార్కెట్లు అందరికీ అందుబాటులో ఉండేలా, సరఫరాలో స్థిరత్వం ఉండేలా జీ20 దేశాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

ఎల్‌పీజీ సరఫరా అత్యంత కీలకం

భారత్‌కు వంట ఇంధనంగా ఉపయోగించే ఎల్‌పీజీ నిరంతరాయంగా, నమ్మకంగా అందుబాటులో ఉండటం అత్యవసరమని జైశంకర్ స్పష్టం చేశారు. కొన్ని దేశాలు చమురు, సహజ వాయువు సరఫరాకు సంబంధించి తమకు అనుకూలంగా మినహాయింపులు ప్రకటించడం అంతర్జాతీయంగా ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఒక దేశం తీసుకునే నిర్ణయాలు ఇతర దేశాలపై చూపే ప్రభావాన్ని తక్కువగా అంచనా వేయరాదని సూచించారు.

సైనిక పరిష్కారాలు పనిచేయవు

అంతర్జాతీయ సమస్యలకు సైనిక చర్యలు శాశ్వత పరిష్కారం చూపలేవని, దౌత్యపరమైన చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని జైశంకర్ పిలుపునిచ్చారు. సముద్రయాన సిబ్బందిపై దాడులను తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయ సముద్ర చట్టాలకు అనుగుణంగా నౌకాయాన స్వేచ్ఛను పరిరక్షించాలని, నౌకలు, నావికులపై దాడులను నిలిపివేయాలని కోరారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణల కారణంగా ఇంధనం, ఆహారం, ఎరువుల సరఫరా వ్యవస్థలపై ఒత్తిడి పెరుగుతోందని చెప్పారు. ముఖ్యంగా గ్లోబల్ సౌత్ దేశాలు ఈ పరిణామాల భారాన్ని అధికంగా మోస్తున్నాయని పేర్కొన్నారు.

ప్రత్యామ్నాయ సరఫరా వ్యవస్థలు అవసరం

మార్కెట్లలోకి ఉత్పత్తులను అధికంగా మళ్లించడం, సరఫరా గొలుసులను ఆయుధాలుగా ఉపయోగించడం, ఇతర దేశాలకు మార్కెట్ ప్రవేశాన్ని అడ్డుకోవడం వంటి చర్యలు పారిశ్రామిక అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నాయని జైశంకర్ విమర్శించారు. ప్రత్యామ్నాయ రవాణా మార్గాలు, పటిష్టమైన సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కీలక ఖనిజాల అన్వేషణ నుంచి రీసైక్లింగ్ వరకు భారత్ ప్రత్యేక జాతీయ మిషన్‌ను అమలు చేస్తోందని వివరించారు. ఇంధన నిల్వలు, స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు, గ్రీన్ హైడ్రోజన్, జీవ ఇంధనాల అభివృద్ధికి అంతర్జాతీయ పెట్టుబడులు, ఆర్థిక సహకారం పెరగాలని సూచించారు. ఉగ్రవాద ముప్పును కూడా వ్యూహాత్మక కారణాలతో విస్మరించరాదని హెచ్చరించారు.

పలు దేశాల మంత్రులతో ద్వైపాక్షిక చర్చలు

జీ20 సమావేశం సందర్భంగా జైశంకర్ కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్‌తో భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత విస్తరించడంపై చర్చించారు. అర్జెంటీనా విదేశాంగ మంత్రి పాబ్లో క్విర్నోతో వాణిజ్యం, కీలక ఖనిజాలు, రక్షణ, అణు సహకారంపై మాట్లాడారు. మెక్సికో విదేశాంగ మంత్రి రాబర్టో వెలాస్కో అల్వారెజ్, బ్రెజిల్ విదేశాంగ మంత్రి మౌరో వియెరా, జర్మనీ విదేశాంగ మంత్రి జోహాన్ వాడెఫుల్‌తోనూ సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలు, అంతర్జాతీయ పరిణామాలపై చర్చలు జరిపారు.

అనువాదంలో కవి భావాన్ని అర్థం చేసుకోవడం అత్యంత ముఖ్యం

సరళమైన భాషలోనే గొప్ప సాహిత్యాన్ని అందించాలి

అనువాదంలో భావానికి పెద్దపీట వేయాలి

సుప్రీం కోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ

డాక్టర్ పి. కృష్ణయ్య అనువదించిన రవీంద్రనాథ్ ఠాగూర్ 'గీతాంజలి' తెలుగు గ్రంథం ఆవిష్కరణ



'గీతాంజలి' తెలుగు గ్రంథాన్ని జస్టిస్ ఎన్వీ రమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ సాహిత్యంలో విశిష్ట స్థానం సంపాదించుకున్న గీతాంజలి వంటి రచనను మరో భాషలోకి తీసుకురావడం సాధారణ విషయం కాదన్నారు. ముఖ్యంగా కవిత్వంలో ప్రతి పదానికి ఒక ప్రత్యేకమైన భావం, లోతైన అనుభూతి ఉంటుందని, వాటిని అర్థం చేసుకోకుండా చేసే అనువాదం మూల రచనకు న్యాయం చేయలేదని పేర్కొన్నారు. అనువాదకుడు ముందుగా కవి ఆలోచనా ప్రపంచంలోకి వెళ్లి, ఆయన వ్యక్తీకరించిన భావాలను ఆకళింపు చేసుకోవాలని సూచించారు. కృష్ణయ్య ఈ విషయంలో సఫలీకృతులు అయ్యారని చెప్పారు. సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల ప్రాధాన్యాన్ని వివరించారు. తెలుగు భాషాభివృద్ధికి ఇటువంటి పుస్తకాలు, సాహిత్య కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. డాక్టర్ పి. కృష్ణయ్య

విజయవాడ, మహానగర్

ఒక భాషలోని సాహిత్యాన్ని మరో భాషలోకి అనువదించేటప్పుడు మూల రచయిత భావాన్ని, అంతరార్థాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడం అత్యంత ముఖ్యమని సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. అనువాదం అనేది కేవలం పదాలను మరో భాషలోకి మార్చడం కాదని, కవి హృదయంలోని భావాన్ని, ఆలోచనలను, అనుభూతులను పాఠకులకు అందించడమని పేర్కొన్నారు. సరళమైన భాషలో గొప్ప సాహిత్యాన్ని అందించడమే మంచి అనువాదకుడి లక్షణమని అభిప్రాయపడ్డారు. గవర్నర్‌పేటలోని సీవీఆర్‌జీఎం హైస్కూల్ ప్రాంగణంలో శనివారం సాయంత్రం ఎమస్కో పబ్లిషర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ , మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ పి. కృష్ణయ్య అనువదించిన రవీంద్రనాథ్ ఠాగూర్ విశ్వవిఖ్యాత రచన రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన గీతాంజలిని తెలుగులోకి అనువదిస్తూ మూల రచనలోని భావసంపదను తెలుగు పాఠకులకు చేరువ చేసే ప్రయత్నం చేశారు. అనువాదంలో సరళమైన భాషకు ప్రాధాన్యమిస్తూ సాహిత్య విలువలు, కవితాత్మకత దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష, సాహిత్య పరిరక్షణకు అనువాద రచనలు ఎంతో అవసరమని అన్నారు. ప్రపంచ ప్రసిద్ధ రచనలను మాతృభాషలో అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ సాహిత్యం సమాజానికి ఆలోచనను, విజ్ఞానాన్ని అందించే శక్తివంతమైన సాధనమని తెలిపారు. ఇటువంటి గ్రంథాలు భావితరాలకు సాహిత్య వారసత్వాన్ని పరిచయం చేస్తాయని అన్నారు. ఎమస్కో పబ్లిషర్స్ అధినేత విజయకుమార్ మాట్లాడుతూ నాణ్యమైన సాహిత్య గ్రంథాలను పాఠకులకు అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రచురణ సంస్థ లక్ష్యమని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత సాహిత్య రచనలను తెలుగు పాఠకులకు పరిచయం చేయడంలో ప్రచురణ సంస్థ కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాహిత్యాభిమానులు, విద్యావేత్తలు, ప్రముఖులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల విధులకు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సిద్ధం

క్యూ లైన్ల నిర్వహణలో స్పెషల్ పోలీస్ ఆఫీసర్లుగా సేవలు

వాలంటీర్లకు దిశానిర్దేశం చేసిన పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు, సబ్ కలెక్టర్ వెన్నెల శ్రీను





విజయవాడ, మహానగర్

స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్, జిల్లా యంత్రాంగం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల విధుల్లో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను కూడా భాగస్వాములను చేస్తున్నారు. క్యూ లైన్ల నిర్వహణలో 1,100 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్పెషల్ పోలీస్ ఆఫీసర్లుగా (ఎస్పీఓలు) సేవలందించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ గ్రౌండ్‌లో నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు అధ్యక్షతన వాలంటీర్లకు ఎన్నికల విధులపై శిక్షణ, దిశానిర్దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికలు అత్యంత ముఖ్యమైనవని, గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ప్రజాస్వామ్య పాలన ద్వారానే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. విధుల నిర్వహణలో ఓటర్లతో మర్యాదగా, వినయంగా వ్యవహరించాలని, క్యూ లైన్లలో క్రమపద్ధతిలో ఓటు వేసి బయటకు వెళ్లేలా చూడాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తమ క్రమశిక్షణ, సేవాభావంతో ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇతర రాష్ట్రాల వారు సైతం ఇక్కడి వాలంటీర్ల సేవలను ప్రశంసించేలా విధులు నిర్వహించాలని కోరారు. వాలంటీర్లకు విధుల నిర్వహణ సులభతరం చేసేందుకు పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్ (బెల్ హెల్లర్స్) అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో పుష్కరాలు, దసరా ఉత్సవాలు, ఎన్నికల సమయంలో వినియోగించేందుకు 1,150 బెల్ హెల్లర్లను కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. సబ్ కలెక్టర్ వెన్నెల శ్రీను మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీస్ శాఖతో పాటు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. ఇటీవల బుడమేరు వరదలు, దసరా ఉత్సవాల సమయంలో పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు ఆధ్వర్యంలో సమర్థవంతమైన బందోబస్తు నిర్వహించడంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల పాత్ర కీలకంగా నిలిచిందని పేర్కొన్నారు. విద్యార్థి దశలోనే సామాజిక సేవా కార్యక్రమాలు, ఎన్నికల విధుల్లో పాల్గొనడం ద్వారా వారిలో ప్రజాస్వామ్య స్ఫూర్తి పెంపొందుతుందని అన్నారు. కార్యక్రమంలో డీసీపీలు కె.జి.వి. సరిత, బి. సత్యనారాయణ, ఏఆర్ ఏసీపీ ప్రేమ్ కుమార్, ఇన్స్పెక్టర్ ఎం.వి. దుర్గారావు, ఆర్ఐలు రాజేంద్ర ప్రసాద్, శ్రీకాంత్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రమేష్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, వివిధ కళాశాలలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

జాతీయ ఐక్యతకు కృషి చేసిన మహానుభావులు వల్లభ్ భాయ్ పటేల్

నిజామాబాద్ : జాతీయ ఐక్యత కోసం కృషి చేసిన మహానుభావులు ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. వల్లభ్ భాయ్ పటేల్ జయంతి సందర్భంగా శనివారం నగరంలోని వర్ని చౌరస్తాలో గల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 562 సంస్థానాలను విలీనం చేయడంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. దేశ సమగ్రత ఐక్యతకోసం ఆయన చూపిన మార్గం నేటి తరానికి స్ఫూర్తి దాయకమన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గుజరాత్ లో ప్రపంచంలోనే ఎత్తైన " స్టాచ్యూ ఆఫ్ యూనిటీ " పటేల్ విగ్రహాన్ని నిర్మించి ఘనమైన నివాళి అందించా రన్నారు. అలాగే నిజాం నిరంకుశ పాలనకు ముగింపు పలికి హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావడానికి పటేల్ కీలక నిర్ణయాలు తీసుకున్నా రన్నారు. ప్రధానంగా 1948 సెప్టెంబర్ 13న భారత సైన్యం హైదరాబాద్ సంస్థానంలో ఆపరేషన్ పోలో ప్రారంభించి, సెప్టెంబర్ 17న నిజాం లొంగుబాటు ప్రకటించడంతో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైం దన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, బీజేపీ కార్పొరేటర్లు కల్పే అర్చనా చిరంజీవి, జగదీష్ కులకర్ణి, మల్కాయి మహేందర్, మఠం పవన్, న్యాలం సునీత రాజు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీటీసీ అభ్యర్థి వెంకన్నకు ఎంపీ చిన్ని పరామర్శ



విజయవాడ, మహానగర్

అస్వస్థతకు గురై విజయవాడలోని ఆయుష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తిరువూరు రూరల్ ఎంపీటీసీ అభ్యర్థి గద్దె వెంకన్నను పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) శనివారం పరామర్శించారు. ఆసుపత్రిలోని ఎంఐసీయూలో చికిత్స పొందుతున్న వెంకన్నను స్వయంగా కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి ఎండీ గోపాలకృష్ణను కలిసి వెంకన్నకు అందిస్తున్న వైద్య సేవలు, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. వెంకన్నకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని వైద్యులను కోరిన ఎంపీ చిన్ని, ఆయన త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వెంకన్నకు ధైర్యం చెప్పి, ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పండుగ వేళ నోటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం





విజయవాడ, మహానగర్

దీపావళి పండుగ సందర్భంగా ఇళ్లను శుభ్రం చేసుకోవడం, అలంకరించడం, బంధుమిత్రులకు ఆహ్వానం పలికేందుకు ఏర్పాట్లు చేయడం వంటి పనుల్లో ప్రజలు నిమగ్నమవుతున్న నేపథ్యంలో నోటి ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని దంత నిపుణులు సూచిస్తున్నారు. పండుగ వేళ తీరికలేని షెడ్యూళ్లు, అర్ధరాత్రి వరకు వేడుకలు, తరచూ జరిగే సమావేశాలు, స్వీట్లు, చిరుతిళ్ల అధిక వినియోగం కారణంగా రోజువారీ దంత సంరక్షణ అలవాట్లు నిర్లక్ష్యానికి గురయ్యే అవకాశం ఉందని డాక్టర్ సోనియా దత్తా పేర్కొన్నారు. ప్రతిరోజూ దంతాలపై ఏర్పడే పాచి (ప్లేక్)ను సరైన పద్ధతిలో తొలగించకపోతే దంతక్షయం, చిగుళ్ల సమస్యలు తదితర ఇబ్బందులు తలెత్తుతాయని వివరించారు. ముఖ్యంగా చక్కెర పదార్థాలు, పానీయాలను తరచుగా తీసుకోవడం వల్ల ఈ ముప్పు మరింత పెరుగుతుందని తెలిపారు. రోజుకు రెండుసార్లు బ్రష్ చేయడం, పళ్ల మధ్య పేరుకునే ఆహార అవశేషాలను శుభ్రం చేయడం, తీపి పదార్థాల వినియోగాన్ని పరిమితం చేసుకోవడం, నిద్రపోయే ముందు నోటి పరిశుభ్రత పాటించడం వంటి అలవాట్లు దంత ఆరోగ్యాన్ని కాపాడతాయని సూచించారు. రోజువారీ దంత సంరక్షణలో నాణ్యమైన టూత్‌పేస్ట్‌ను ఎంచుకోవడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. డాబర్ రెడ్ పేస్ట్‌లో లవంగ నూనె, తామర బీజం (జాంతోక్సిలమ్), పుదీనా సత్వ వంటి ఆయుర్వేద పదార్థాలు ఉన్నాయని, ఇది ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడిఏ) ఆమోదం పొందిందని సంస్థ వెల్లడించింది. పండుగ సన్నాహాల్లో ఇళ్ల పరిశుభ్రతకు ఎంత ప్రాధాన్యం ఇస్తామో, నోటి ఆరోగ్యానికి కూడా అంతే శ్రద్ధ చూపాలని దంత నిపుణులు సూచిస్తున్నారు. పండుగ ముగిసినా ఆరోగ్యకరమైన దంత సంరక్షణ అలవాట్లు ఏడాది పొడవునా కొనసాగాలని తెలిపారు.

పిఓలు, ఏపిఓలు, ఓపిఓలు అందరు టీంగా పని చేయాలి

పోలింగ్ రోజు చాలా ముఖ్యమైనది.:

జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల

పిఓలు,ఏపిఓలు,ఓపిఓలలు అందరు చిత్తశుద్ధితో బాధ్యతగా ఎన్నికలు విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల పేర్కొన్నారు. శనివారం ముప్పాళ్ల లో 2 వ సాధారణ ఎన్నికలు, స్థానిక సంస్థలు ఎంపీటీసీ ,జడ్పీటీసీ ఎన్నికల పి ఓ,ఏ పి ఓలు,ఓ పి ఓ ల కు 2 వ విడత శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పి ఓ లు,ఏ పి ఓలు,ఓ పి ఓ లు అందరు చిత్తశుద్ధితో ఎన్నికలు విధులు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.. బారత రాజ్యాంగ లో ఎన్నికలు స్వచ్ఛగా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలని ఉందన్నారు. ఎన్నికల విధులు నిర్వహించడం అదృష్టం గా బావించాలన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు మనందరం బాధ్యతగా పని చేయాలన్నారు. ముఖ్యంగా సున్నితమైన, అతి సున్నితమైన పోలింగ్ స్టేషన్లలో సిబ్బంది నియామకం, అక్కడ నిర్వర్తించాల్సిన విధులపై స్పష్టమైన అవగాహన కల్పించారు.పోలింగ్ రోజు చాలా ముఖ్యమైందని పి ఓ ఏపీ ఓపిఓలు అందరూ సమానంగా విధులు నిర్వహించాలన్నారు పోలింగ్ కేంద్రంలో ఏమైనా గొడవలు జరిగితే కూల్ గా ఉండాలన్నారు మీకు ఏమైనా సమస్యలు ఇబ్బందులు ఉంటే అధికారి ఎంపీడీవో తాసిల్దారు పోలీస్ సిబ్బంది అందరూ ఉంటారని మీకు ఏమైనా అవసరమైతే వెంటనే సంబంధిత అధికారికి ఫోన్ ద్వారా తెలియజేయగలరు అని తెలిపారు.

హైకోర్టు జడ్జి సిద్దిపేట జిల్లాలో పర్యటన

సిద్దిపేట : రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ శరత్ శనివారం జిల్లాలో పర్యటించి జిల్లా కేంద్రంలోనీ సంతోషిమాత ఆలయం దగ్గరలో జువెనైల్ జస్టిస్ బోర్డును ప్రారంభించారు. జిల్లా కోర్టు ఆవరణలో కోర్టు సిబ్బంది మరియు కోర్టుపనుల మీద వచ్చే ప్రజల సౌకర్యార్థం మెడికల్ డిస్పెన్సరీని ప్రారంభించి వసతులను పరిశీలించారు. అనంతరం కోర్టు భవనంలోని మూడో ఫ్లోర్ లో గల కాన్ఫరెన్స్ హాల్లో జ్యుడీషియల్ అధికారులతో జ్యుడీషియరీ రివ్యూ లో పాల్గొన్నారు. శనివారం కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శనం చేసుకున్న అనంతరం జిల్లా కేంద్రానికి చేరుకున్న హైకోర్టు జడ్జి జస్టిస్ కె. శరత్ కు జిల్లా జడ్జి జి. సుదర్శన్, జిల్లా కలెక్టర్ కె. హైమావతి, కమిషనర్ ఆఫ్ పోలీస్ సాధన రష్మీ పెరుమాళ్ లు పూల బోకే అందించి స్వాగతం పలికారు. పోలీసు వారు గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అదనపు జడ్జి జయప్రసాద్, జిల్లా న్యాయ సేవాసాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య, అదన్నపు డిసిపి కుషాల్కర్, బార్ అసోసియేషన్ సభ్యులు, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ధనరాజ్, న్యాయశాఖ, పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

రూ.45.76 లక్షల కోట్లు ఫట్... ఒక్కరోజే భారీగా కరిగిపోయిన గూగుల్ విలువ



న్యూయార్క్ : అమెరికా స్టాక్ మార్కెట్లలో టెక్నాలజీ షేర్లు భీకర నష్టాలను చవిచూస్తున్నాయి. గురువారం ఒక్కరోజే గూగుల్ మాతృ సంస్థ అల్ఫాబెట్ షేర్ విలువ నాస్‌డాక్‌లో ఏకంగా 12.6 శాతం పడిపోయింది. దీంతో కంపెనీ మార్కెట్ వాల్యూ మునుపెన్నడూ లేనివిధంగా 482 బిలియన్ డాలర్లు (డాలర్‌తో పోల్చితే ప్రస్తుత రూపాయి మారకం విలువ ప్రకారం దాదాపు రూ.45.76 లక్షల కోట్లు) హరించుకుపోయింది. ఫలితంగా అగ్రరాజ్య ఈక్విటీ మార్కెట్ల చరిత్రలో ఎన్విడియా (సుమారు 600 బిలియన్ డాలర్లు) తర్వాత సింగిల్ సెషన్‌లో ఇంతలా నష్టపోయిన కంపెనీగా అల్ఫాబెట్ రికార్డులకెక్కింది. గతంలో అల్ఫాబెట్ అత్యధికంగా జూలై 23న దాదాపు 275 బిలియన్ డాలర్ల నష్టం పాలైంది. నిజానికి 2008 అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం, కరోనా సమయాల్లోనూ ఏరోజూ కంపెనీ షేర్ వాల్యూ 10 శాతాన్ని మించి పడిపోకపోవడం గమనార్హం.

ఇదీ సంగతి..

అల్ఫాబెట్ షేర్లు ఒక్కసారిగా కుప్పకూలడం వెనుకనున్న కారణాలను విశ్లేషిస్తే.. ప్రధానంగా ఈ ఏడాది జూలై-సెప్టెంబర్‌కుగాను కంపెనీ తాజాగా ప్రకటించిన ఆర్థిక ఫలితాలు వాల్‌స్ట్రీట్ అంచనాలను అందుకోలేదు. గత ఏడాది ఇదే వ్యవధితో పోల్చితే 25 శాతం పెరిగి 127.6 బిలియన్ డాలర్లుగా ఆదాయం నమోదైంది. ఇందులో గూగుల్ రెవెన్యూ 12 శాతం వృద్ధితో దాదాపు 63 బిలియన్ డాలర్లుగానే ఉన్నది. కానీ 65 బిలియన్ డాలర్లుగా ఉంటుందని మార్కెట్ వర్గాలు అంచనా వేశాయి. నిజానికి జనవరి-మార్చిలో 19 శాతం, ఏప్రిల్-జూన్‌లో 17 శాతం వృద్ధి నమోదైంది. అయితే గూగుల్ క్లౌడ్ రెవెన్యూ మునుపటితో చూస్తే రెట్టింపునకుపైగా ఎగిసి సుమారు 31 బిలియన్ డాలర్లకు చేరింది. జెమినీ యాప్ వినియోగదారులూ ప్రపంచవ్యాప్తంగా 100 కోట్లను దాటారు. అయినా పెట్టుబడుల ఉపసంహరణ జరిగింది.

నగదు నిల్వలు ధమాల్

జూలై-సెప్టెంబర్‌లో సర్వర్లు, నెట్‌వర్కింగ్ ఎక్విప్‌మెంట్, డాటా సెంటర్ల వంటి సాంకేతిక మౌలిక సదుపాయాల కోసం అల్ఫాబెట్ 51.4 బిలియన్ డాలర్లను కేటాయించింది. గత ఏడాది మొత్తంగానే 91.4 బిలియన్ డాలర్లుగా ఉన్నది. ఈ నేపథ్యంలో సంస్థ నగదు నిల్వల ప్రవాహం మైనస్ 9.07 బిలియన్ డాలర్లకు దిగజారింది. ఈ క్రమంలోనే ఒక్కసారిగా అమ్మకాల ఒత్తిడి చోటుచేసుకున్నది. ఈ ఏడాది మే నుంచి అల్ఫాబెట్ షేర్లు తరచూ భారీగా నష్టపోతూనే ఉన్నాయి. దీంతో దాదాపు ఇప్పటిదాకా 1.4 ట్రిలియన్ డాలర్ల మేర కంపెనీలో పెట్టుబడులు పెట్టిన మదుపర్ల సంపద ఆవిరైపోయింది. ఈ గణాంకాలు సైతం అల్ఫాబెట్ షేర్లను సెల్లింగ్ ప్రెషర్‌కు గురిచేస్తున్నాయి. శుక్రవారం ట్రేడింగ్‌లోనూ షేర్లు నష్టాలకు లోనయ్యాయి.

భారత్‌లో ఇళ్ల కొనుగోలుకు ఎన్ఆర్ఐల ఆసక్తి

తొలి ప్రాధాన్య నగరాల్లో ముంబై, బెంగళూరు
ఢిల్లీ-ఎన్‌సీఆర్, పుణేకు కూడా ఆదరణ
టాప్-5 నగరాల జాబితాలో హైదరాబాద్
ఐటీ, మౌలిక వసతులతో హైదరాబాద్‌కు ఆకర్షణ
అద్దె ఆదాయం, వైద్య సదుపాయాలకు ప్రాధాన్యం



విదేశాల్లో స్థిరపడిన భారతీయులు (ఎన్ఆర్ఐలు) స్వదేశంలో ఇళ్లు, స్థిరాస్తులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. గతంలో పెట్టుబడి, ఆస్తి విలువ పెరుగుదలే ప్రధాన లక్ష్యాలుగా ఉండగా.. ఇప్పుడు అద్దె ఆదాయం, మెరుగైన నిర్మాణ నాణ్యత, రవాణా సౌకర్యాలు, వైద్య సేవలు వంటి అంశాలకూ ప్రాధాన్యం ఇస్తున్నారు. తల్లిదండ్రులకు సౌకర్యవంతమైన నివాసం ఏర్పాటు చేయాలన్న ఆలోచన కూడా వారి నిర్ణయాలను ప్రభావితం చేస్తోంది. ఈ నేపథ్యంలో ముంబై, బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్, పుణే, హైదరాబాద్ నగరాలు ఎన్ఆర్ఐల దృష్టిని ఆకర్షిస్తున్నాయని నివేదికలు వెల్లడిస్తున్నాయి.

ముంబై, బెంగళూరుకు ప్రత్యేక ఆదరణ

దేశ ఆర్థిక రాజధాని ముంబైలో అంతర్జాతీయ విమాన సదుపాయాలు, విస్తరిస్తున్న మౌలిక వసతులు, వివిధ ధరల్లో అందుబాటులో ఉన్న నివాస గృహాలు ఎన్ఆర్ఐలను ఆకర్షిస్తున్నాయి. ముంబై మెట్రోపాలిటన్ రీజియన్‌లో కొత్త ప్రాంతాలు అభివృద్ధి చెందుతుండటంతో సంప్రదాయ ఖరీదైన ప్రాంతాలకు బయట కూడా కొనుగోలు అవకాశాలు పెరుగుతున్నాయి. ఐటీ రంగానికి కేంద్రంగా ఉన్న బెంగళూరులో వైట్‌ఫీల్డ్, సర్జాపూర్, ఉత్తర బెంగళూరు ప్రాంతాలపై కొనుగోలుదారులు ఆసక్తి చూపిస్తున్నారు. ఉద్యోగావకాశాలు అధికంగా ఉండటంతో అద్దె ఇళ్లకు డిమాండ్ ఉండటం కూడా పెట్టుబడిదారులకు కలిసొస్తోంది.

ఢిల్లీ-ఎన్‌సీఆర్, పుణే కూడా కీలకమే

ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలోని గురుగ్రామ్‌లో ప్రీమియం నివాస ప్రాజెక్టులు, కార్పొరేట్ సంస్థలు, మెరుగుపడుతున్న రవాణా సదుపాయాలు కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నాయి. రాజధాని ప్రాంతంలో కుటుంబ సభ్యులు ఉన్న ఎన్ఆర్ఐలకు అక్కడ ఇల్లు కొనడం మరో ప్రయోజనంగా మారుతోంది. పుణేలో ఉద్యోగ అవకాశాలతో పాటు విద్యా సంస్థలు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండటం సానుకూల అంశం. ముంబైకి సమీపంలో ఉండటం, పెద్ద నగరాలతో పోలిస్తే ప్రశాంతమైన జీవనశైలి కోరుకునేవారికి అనుకూలంగా ఉండటం ఈ నగరానికి ఆదరణ పెంచుతోంది.

హైదరాబాద్‌పై పెరుగుతున్న ఆసక్తి

ఐటీ, వైద్య రంగాల అభివృద్ధి, విస్తరిస్తున్న మౌలిక సదుపాయాలతో హైదరాబాద్ కూడా ఎన్ఆర్ఐలకు ఆకర్షణీయమైన రియల్ ఎస్టేట్ కేంద్రంగా ఎదుగుతోంది. ముఖ్యంగా నగర పశ్చిమ, వాయవ్య ప్రాంతాల్లో ఔటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానమైన నివాస ప్రాంతాలపై ఆసక్తి పెరుగుతోంది. ఉద్యోగ కేంద్రాలకు సులభంగా చేరుకునే అవకాశం, రవాణా సదుపాయాలు కొనుగోలు నిర్ణయాల్లో కీలకంగా మారుతున్నాయి. ఎన్ఆర్ఐ కుటుంబాలు ఇల్లు కొనుగోలు చేసేటప్పుడు తల్లిదండ్రుల భవిష్యత్తు అవసరాలనూ పరిగణనలోకి తీసుకుంటున్నాయని నివేదికలు చెబుతున్నాయి. వైద్య సేవలకు చేరువగా ఉండటం, సామాజిక సంబంధాలు, బహిరంగ ప్రదేశాలు, అవసరమైనప్పుడు సహాయం అందే సదుపాయాలు కూడా ముఖ్యమని వివరించారు. దీంతో స్వదేశంలో స్థిరాస్తి కొనుగోలు నిర్ణయాలు కేవలం పెట్టుబడికే పరిమితం కాకుండా కుటుంబ అవసరాలతోనూ ముడిపడుతున్నాయి.

జియో కొత్త చౌక రీచార్జ్ ప్లాన్లు వచ్చేశాయ్

టెలికాం రంగంలో వాయిస్-ఓన్లీ రీఛార్జ్ ప్లాన్లకు డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో రిలయన్స్ జియో కీలక నిర్ణయం తీసుకుంది. ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా బాటలోనే కొత్త ప్రీపెయిడ్ వాయిస్-ఓన్లీ ప్లాన్లను అందుబాటులోకి తెచ్చింది. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక రీఛార్జ్ ప్యాక్‌లను ప్రవేశపెట్టింది. రూ.147 నుంచి ప్రారంభమయ్యే ఈ ప్లాన్లలో అపరిమిత కాలింగ్‌తో పాటు ఎస్ఎంఎస్ ప్రయోజనాలు లభిస్తాయి. అయితే, వీటిలో మొబైల్ డేటా ఉండదు.

జియో కొత్త వాయిస్-ఓన్లీ ప్లాన్ల వివరాలు

రూ.147 ప్లాన్: ఈ రీఛార్జ్ ప్యాక్ 22 రోజుల వ్యాలిడిటీతో వస్తుంది. ఈ వ్యవధిలో అపరిమిత వాయిస్ కాల్స్, 300 ఎస్ఎంఎస్‌లు పొందవచ్చు. రూ.177 ప్లాన్: 28 రోజుల వ్యాలిడిటీతో లభించే ఈ ప్లాన్‌లో అపరిమిత కాలింగ్, 300 ఎస్ఎంఎస్‌లు అందుబాటులో ఉంటాయి.

రూ.196 ప్లాన్: 30 రోజుల వ్యాలిడిటీతో వచ్చే ఈ ప్యాక్‌లో అపరిమిత కాల్స్, 300 ఎస్ఎంఎస్‌లు లభిస్తాయి.

రూ.197 ప్లాన్: ఈ రీఛార్జ్ ప్యాక్‌లో అపరిమిత కాలింగ్, రోజుకు 300 ఎస్ఎంఎస్‌లు పొందవచ్చు. క్యాలెండర్ నెల ప్రాతిపదికన అంటే నెలలో ఎన్ని రోజులుంటే అన్ని రోజులు వ్యాలిడిటీ ఉంటుంది.



దీర్ఘకాలిక ప్లాన్లు కూడా..

జియో ఇప్పటికే అందిస్తున్న రూ.448, రూ.1,748 వాయిస్-ఓన్లీ ప్లాన్లు కూడా కొనసాగుతున్నాయి. వీటిలో వరుసగా 84 రోజులు, 336 రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది. వీటితో పాటు జియో టీవీ, జియోఏఐ లౌడ్ వంటి అదనపు ప్రయోజనాలు కూడా అందిస్తున్నట్లు కంపెనీ పేర్కొంది. ఈ ప్లాన్లలోనూ మొబైల్ డేటా ప్రయోజనాలు ఉండవు.

ఎవరికి ఉపయోగం?

స్మార్ట్‌ఫోన్‌లో ఇంటర్నెట్ వినియోగం అవసరం లేని వారు, ఫీచర్ ఫోన్లు వాడేవారు, ఒకటి కంటే ఎక్కువ సిమ్‌లు ఉన్నవారు, వై-ఫై ద్వారా మాత్రమే ఇంటర్నెట్ ఉపయోగించే వారికి ఈ వాయిస్-ఓన్లీ ప్లాన్లు ఉపయోగకరంగా ఉంటాయి. డేటా అవసరం లేకుండా కాలింగ్ సేవల కోసం మాత్రమే రీఛార్జ్ చేసుకునే వారికి ఇవి తక్కువ ఖర్చుతో కూడిన ప్రత్యామ్నాయంగా నిలుస్తాయి.

డేటా కూడా కావాలంటే..

కాలింగ్‌తో పాటు కొంత మొబైల్ డేటా కూడా కావాలనుకునే వినియోగదారులు జియో రూ.189 ప్లాన్‌ను పరిశీలించవచ్చు. ఈ ప్యాక్ 28 రోజుల వ్యాలిడిటీతో అపరిమిత కాల్స్, 300 ఎస్ఎంఎస్‌లు, మొత్తం 2 జీబీ డేటాను అందిస్తుంది. జియో టీవీ, జియోఏఐ లౌడ్ ప్రయోజనాలు కూడా ఇందులో ఉన్నాయి.

ఐదో టీ20కి దినేశ్ కార్తీక్ కొత్త ప్లాన్.. సంజూ, వైభవ్ ఇద్దరికీ చోటు!

వైభవ్ కోసం సంజూను తప్పించొద్దన్న కార్తీక్
అభిషేక్‌కు విశ్రాంతినివ్వాలని సూచన
అక్షర్‌ను కొనసాగించాలని అభిప్రాయం
అర్ష్‌దీప్‌కు బ్రేక్ ఇవ్వొచ్చని సూచన
మయాంక్, ప్రిన్స్‌కు అవకాశం కల్పించాలని సలహా



న్యూజిలాండ్‌తో ఐదో టీ20లో యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి అవకాశం కల్పించేందుకు సంజూ శాంసన్‌ను పక్కన పెట్టాల్సిన అవసరం లేదని భారత మాజీ వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ సూచించాడు. వైభవ్‌ను ఆడించాలనుకుంటే అభిషేక్ శర్మకు విశ్రాంతినివ్వాలని అభిప్రాయపడ్డాడు. సిరీస్‌ను భారత్ ఇప్పటికే కైవసం చేసుకున్న నేపథ్యంలో ఆటగాళ్లకు విశ్రాంతినిస్తూ జట్టులో మార్పులు చేయవచ్చని పేర్కొన్నాడు. క్రిక్‌బజ్‌తో మాట్లాడుతూ కార్తీక్ ఈ సూచన చేశాడు. "వైభవ్ ఆడాలని అందరూ కోరుకుంటున్నారు. అతడికి అవకాశం ఇవ్వాలంటే అభిషేక్‌కు విశ్రాంతి ఇవ్వాలి. వైభవ్ గురించి చర్చ వచ్చిన ప్రతిసారీ సంజూనే ఎందుకు తప్పించాలి? అభిషేక్‌కు కూడా విశ్రాంతి ఇవ్వొచ్చు. ఇక్కడ కీలకమైన విషయం విశ్రాంతి మాత్రమే" అని కార్తీక్ అన్నాడు. బౌలింగ్ విభాగంలోనూ మార్పులు చేయాలని కార్తీక్ సూచించాడు. అక్షర్ పటేల్‌ను కొనసాగిస్తూ అర్ష్‌దీప్ సింగ్‌కు విశ్రాంతినివ్వవచ్చని చెప్పాడు. అతడి స్థానంలో మయాంక్ యాదవ్, ప్రిన్స్ యాదవ్‌లకు అవకాశం కల్పించవచ్చని అభిప్రాయపడ్డాడు. ఈ సిరీస్‌లో అర్ష్‌దీప్ అద్భుతంగా బౌలింగ్ చేశారని, పరిస్థితులను బట్టి అదనపు స్పిన్నర్‌ను పరీక్షించవచ్చని పేర్కొన్నాడు. గాయంతో ఇషాన్ కిషన్ రెండు, మూడో టీ20లకు దూరం కావడంతో వైభవ్‌కు జట్టులో చోటు దక్కింది. మూడో మ్యాచ్‌లో 19 బంతుల్లో 45 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. ఇషాన్ కోలుకుని తిరిగి రావడంతో నాలుగో టీ20లో వైభవ్‌కు అవకాశం దక్కలేదు. ఐదో టీ20 నవంబర్ 1న హామిల్టన్‌లో జరగనుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 3-1తో ఆధిక్యంలో ఉంది.

భారత మహిళా క్రికెట్‌కు 50 ఏళ్లు..

నాటి కష్టాలను గుర్తుచేసుకున్న శుభాంగి కులకర్ణి



భారత మహిళా క్రికెట్ చరిత్రలో శనివారం ఒక సువర్ణాధ్యాయం. సరిగ్గా 50 ఏళ్ల క్రితం, 1976 అక్టోబర్ 31న, భారత మహిళల జట్టు బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో వెస్టిండీస్‌తో తమ మొట్టమొదటి అంతర్జాతీయ టెస్ట్ మ్యాచ్ ఆడింది. ఆ చారిత్రక మ్యాచ్‌లో భాగమైన మాజీ కెప్టెన్, లెజెండరీ స్పిన్నర్ శుభాంగి కులకర్ణి, ఈ స్వర్ణోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని ఆనాటి జ్ఞాపకాలను 'బీసీసీఐ.టీవీ'తో పంచుకున్నారు. "ఆ రోజు డ్రెస్సింగ్ రూమ్‌లో మేమంతా ఎంతో ఉత్సాహంగా ఉన్నాం. మాలో చాలామంది 17-18 ఏళ్ల వయసున్న కాలేజీ అమ్మాయిలమే. అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్నామన్న ఆనందం మాటల్లో చెప్పలేనిది" అని శుభాంగి గుర్తుచేసుకున్నారు. కేవలం 17 ఏళ్ల వయసులో అరంగేట్రం చేసిన ఆమె, ఆ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లోనే 48 పరుగులకు 5 వికెట్లు పడగొట్టి చరిత్ర సృష్టించారు. అయితే, ఆ ప్రయాణం పూలపాన్పు కాదని, ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నామని ఆమె తెలిపారు. "అప్పట్లో క్రికెట్ ఆడటానికి ఇంట్లో అనుమతి తీసుకోవడమే పెద్ద సవాల్. గాయాలవుతాయని, ఎండలో ఆడితే నల్లబడిపోతామని తల్లిదండ్రులు భయపడేవారు. దేశవాళీ టోర్నీలకు సొంత డబ్బులు ఖర్చుపెట్టుకుని, కొన్నిసార్లు రిజర్వేషన్ లేని రైలు బోగీల్లో ప్రయాణించేవాళ్లం" అని ఆనాటి కష్టాలను వివరించారు. మహిళా క్రికెట్ అసోసియేషన్ (డబ్ల్యూసీఏఐ) కార్యదర్శిగా, 2006లో దానిని బీసీసీఐలో విలీనం చేయడంలో శుభాంగి కీలక పాత్ర పోషించారు. శరద్ పవార్ సహకారంతో జరిగిన ఈ విలీనమే మహిళా క్రికెట్ దశను మార్చిందని ఆమె అభిప్రాయపడ్డారు. "ఆ విలీనం తర్వాతే అమ్మాయిలకు మెరుగైన సౌకర్యాలు అందడం మొదలైంది. నాటి మా కష్టాలతో పోలిస్తే, నేటి తరానికి బీసీసీఐ అద్భుతమైన వసతులు కల్పిస్తోంది.

స్పోర్ట్స్

టెస్టు క్రికెట్లో రబాడ సరికొత్త చరిత్ర.. డేల్ స్టెయిన్ రికార్డు బ్రేక్

టెస్ట్ క్రికెట్‌లో కగిసో రబాడ అరుదైన ఘనత
బంతుల పరంగా అత్యంత వేగంగా 350 వికెట్లు పూర్తి
సొంత దేశ బౌలర్ డేల్ స్టెయిన్ రికార్డును అధిగమించిన రబాడ
ఆస్ట్రేలియాతో టెస్టులో ట్రావిస్ హెడ్‌ను ఔట్ చేయడం ద్వారా మైలురాయి
ఒకే ఓవర్లో రెండు కీలక వికెట్లు తీసి ఆసీస్‌ను దెబ్బకొట్టిన దక్షిణాఫ్రికా పేసర్



దక్షిణాఫ్రికా స్టార్ ఫాస్ట్ బౌలర్ కగిసో రబాడ టెస్ట్ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. బంతుల పరంగా అత్యంత వేగంగా 350 వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఆస్ట్రేలియాతో కేప్‌టౌన్‌లోని న్యూలాండ్స్ వేదికగా జరుగుతున్న మూడో టెస్టు ఐదో రోజు ఆటలో ఈ అరుదైన మైలురాయిని అందుకున్నాడు. సిరీస్ విజేతను నిర్ణయించే ఈ మ్యాచ్‌లో 288 పరుగుల లక్ష్య ఛేదనకు ఆస్ట్రేలియా బరిలో దిగగా, ఈ ఇన్నింగ్స్‌లోనే రబాడ ఈ ఘనత సాధించాడు. ఆసీస్ స్టార్ బ్యాటర్ ట్రావిస్ హెడ్‌ను ఔట్ చేయడం ద్వారా తన 350వ వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు. ఈ ఫీట్ సాధించడానికి రబాడకు కేవలం 13,808 బంతులు మాత్రమే అవసరమయ్యాయి. ఇంతకుముందు ఈ రికార్డు దక్షిణాఫ్రికాకే చెందిన మరో దిగ్గజ పేసర్ డేల్ స్టెయిన్ (14,719 బంతులు) పేరిట ఉండేది. ఇప్పుడు రబాడ తన సహచరుడిని అధిగమించి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో పాకిస్థాన్ మాజీ పేసర్ వకార్ యూనిస్ (14,905 బంతులు) మూడో స్థానంలో ఉన్నాడు. ఆడిన మ్యాచ్‌ల పరంగా చూసినా రబాడ అద్భుతమైన రికార్డును సొంతం చేసుకున్నాడు. అతను తన 75వ టెస్టు మ్యాచ్‌లోనే ఈ ఘనతను అందుకున్నాడు. ఫాస్ట్ బౌలర్లలో అత్యంత వేగంగా 350 వికెట్లు తీసిన వారిలో వెస్టిండీస్ లెజెండ్ మాల్కం మార్షల్‌తో కలిసి సంయుక్తంగా నాలుగో స్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో న్యూజిలాండ్ దిగ్గజం రిచర్డ్ హ్యాడ్లీ, డేల్ స్టెయిన్ (69 టెస్టులు) అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ఈ మ్యాచ్‌లో రబాడ ఆరంభం నుంచే అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ఐదో రోజు ఆటలో బంతిని అందుకున్న అతను, తను వేసిన మొదటి ఓవర్‌లోనే ఆస్ట్రేలియాను కోలుకోలేని దెబ్బ తీశాడు. ఓపెనర్ మాట్ రెన్షా, వన్‌డౌన్ బ్యాటర్ మార్నస్ లబుషేన్‌లను పెవిలియన్‌కు పంపి దక్షిణాఫ్రికాకు అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. ఈ ప్రదర్శనతో రబాడ తన జట్టు విజయావకాశాలను గణనీయంగా పెంచాడు. కాగా, లంచ్ విరామానికి ఆసీస్ రెండో ఇన్నింగ్స్ లో 60 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి విలవిల్లాడుతోంది. మరో మూడు వికెట్లు తీస్తే మ్యాచ్ తో పాటు సిరీస్ కూడా దక్షిణాఫ్రికా వశం అవుతుంది.



‘ఈ నగరానికి ఏమైంది’ సీక్వెల్ ట్రైలర్ అప్‌డేట్..
వచ్చేస్తోన్న మ్యాడ్ గ్యాంగ్!

టాలీవుడ్ యువతను ఊపేసిన కల్ట్ హిట్ సినిమా ఈ నగరానికి ఏమైందికి సీక్వెల్‌గా వస్తున్న చిత్రం ‘ఈఎన్ఈ రీపీట్’ టాలెండ్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ తెరకెక్కించిన ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా.. తాజాగా ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ ఒక క్రేజీ అప్‌డేట్‌ను ప్రకటించి సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చారు. ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను నవంబర్ 3వ తేదీ సాయంత్రం 5:00 గంటలకు విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రంలో విశ్వక్ సేన్, అభినవ్ గోమటం, శ్రీకాంత్ మగంటి, వెంకటేష్ కాకుమాను తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ సినిమాకు వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు. కాగా, ఈ పూర్తి స్థాయి ఎంటర్‌టైనర్ సినిమా నవంబర్ 19, 2026 న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ట్రైలర్‌తో సినిమాపై మరింత హైప్ క్రియేట్ చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.



పా. రంజిత్ ‘వేట్టువం’ రిలీజ్ డేట్ ఫిక్స్..
సంక్రాంతి 2027 బరిలో భారీ యాక్షన్ ఎపిక్!

సరికొత్త కథాంశాలతో సినిమాలను తెరకెక్కిస్తూ టాలీవుడ్, కోలీవుడ్‌లలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ దర్శకుడు పా. రంజిత్ తెరకెక్కిస్తున్న మోస్ట్ అంటెసిపేటెడ్ ప్రాజెక్ట్ ‘వేట్టువం’ విడుదలకు సంబంధించిన అఫిషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చేసింది. ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు మేకర్స్ ముహూర్తం ఫిక్స్ చేశారు. ప్రతిష్టాత్మకమైన సంక్రాంతి 2027 కానుకగా వచ్చే ఏడాది జనవరిలో ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్ అండ్ టీజర్ ఇప్పటికే సోషల్ మీడియాలో భారీ హైప్‌ను క్రియేట్ చేశాయి. ఇది ఒక ఇంటెన్స్ పోస్ట్-అపొకలిప్టిక్ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కుతోంది. హాలీవుడ్ కల్ట్ క్లాసిక్ మూవీ ‘మ్యాడ్ మాక్స్: ఫ్యూరీ రోడ్’ తరహా వైబ్స్ మరియు ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ఉండబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. భూమి విధ్వంసం, కార్పొరేట్ సిండికేట్లు మరియు ప్రాచీన సంస్కృతికి మధ్య జరిగే పోరాట నేపథ్యంలో ఈ కథ సాగనుంది. ఈ చిత్రంలో టాలెంటెడ్ హీరో ఆర్య హీరోగా నటిస్తుండగా, శోభిత ధూళిపాళ వి.ఆర్. దినేష్ రవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. వీరితో పాటు కలైయరసన్, గురు సోమసుందరం, జాన్ విజయ్, షాబీర్ తదితరులు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. నీలం ప్రొడక్షన్స్ మరియు లెర్న్ అండ్ టీచ్ ప్రొడక్షన్ సంస్థలు సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ప్రముఖ సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి అదిరిపోయే మ్యూజిక్ అందిస్తున్నారు.

మ్యూజిక్ డైరెక్టర్‌పై క్లారిటీ.. అనిరుధ్, జీవీ ప్రకాష్‌లకు నో ఛాన్స్, బాలయ్య సినిమా అప్‌డేట్ ఇదే!



నందమూరి నటసింహం బాలకృష్ణ, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ చిత్రం చీదీఖ 112పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. బాలయ్య మాస్ ఇమేజ్‌కు కొరటాల శివ మార్క్ కథనం తోడైతే థియేటర్లలో అభిమానులకు పండగే అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో పూజా కార్యక్రమాలతో ఈ సినిమాను ఘనంగా ప్రారంభించారు. ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన సంగీత దర్శకుడి ఎంపికపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. చీదీఖ 112కు సంగీతం అందించబోయే దర్శకుడు ఎవరనే విషయంపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రకరకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. తొలుత తమిళ స్టార్ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఈ ప్రాజెక్ట్‌కు పనిచేయబోతున్నారని ప్రచారం జరిగింది. అయితే ఆయన వరుస సినిమాలతో బిజీగా ఉండటంతో ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు కథనాలు వెలువడ్డాయి. ఆ తర్వాత అనిరుధ్ స్థానంలో మరో ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్‌ను తీసుకున్నారంటూ వార్తలు వచ్చాయి. దీంతో బాలయ్య సినిమాకు జీవీ ప్రకాష్ సంగీతం అందించబోతున్నారని అభిమానులు భావించారు. ఈ వార్తలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడంతో మ్యూజిక్ డైరెక్టర్ ఎంపికపై ఆసక్తి మరింత పెరిగింది. సంగీత దర్శకుడి ఎంపికపై వస్తున్న వరుస ప్రచారాలకు చిత్ర బృందం తాజాగా స్పందించింది. అనిరుధ్ రవిచందర్, జీవీ ప్రకాష్ కుమార్‌లలో ఎవరినీ ఇప్పటివరకు అధికారికంగా ఖరారు చేయలేదని స్పష్టం చేసింది. ప్రస్తుతం పలువురు సంగీత దర్శకులతో చర్చలు జరుగుతున్నప్పటికీ తుది నిర్ణయం తీసుకోలేదని

రామ్ చరణ్ - సుకుమార్ సినిమా ప్రారంభోత్సవానికి వేళాయె.. ఆసక్తికర పోస్ట్ పెట్టిన దర్శకుడి భార్య!



మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కలయికలో తెరకెక్కనున్న భారీ చిత్రం కోసం మెగా అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ‘రంగస్థలం’ వంటి సంచలన విజయం తర్వాత ఈ ఇద్దరూ మరోసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన విషయం బయటకు వచ్చింది. రేపు ఈ చిత్రం ఘనంగా ప్రారంభం కానుండగా, అంతకంటే ముందే సుకుమార్ భార్య తబితా సుకుమార్ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచింది.తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో తబితా సుకుమార్ ఈ సినిమా గురించి భావోద్వేగపూరితంగా స్పందించారు. సుకుమార్ భార్యగా ఈ ప్రాజెక్ట్ తనకు ఎంతో గర్వంగా, ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ సినిమా రచన కోసం సుకుమార్ ఎంత కష్టపడ్డారో, ఎన్ని గంటలు శ్రమించారో తనకు తెలుసని తెలిపారు. ఆయన పెట్టిన కష్టం, అభిరుచి, అంకితభావం ఇప్పుడు తెరపైకి రాబోతుండటం ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తోందని ఆమె వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ కోసం సుకుమార్ ఎంతో సమయం కేటాయించి కథపై పనిచేశారని తబితా తన పోస్ట్‌లో వివరించారు. ఆయన రచనలో చూపించిన శ్రమ, పట్టుదల తనకు తెలుసని చెబుతూ.. ఆ కష్టం ఒక రూపం దాల్చడం చూడటం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అంతేకాదు, ఎంతో అభిమానాన్ని సంపాదించుకున్న రామ్ చరణ్ -- సుకుమార్ కలయిక రెండోసారి ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో అంచనాలు మరింత పెరిగాయని తెలిపారు. తబితా పెట్టిన ఈ పోస్ట్ మెగా అభిమానులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా సుకుమార్ కథ కోసం ఇంతగా కష్టపడ్డారనే విషయం అభిమానుల్లో సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ గురించి రకరకాల వార్తలు ప్రచారంలో ఉండగా, తాజాగా దర్శకుడి భార్య చేసిన వ్యాఖ్యలు కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. ఈ సినిమా ప్రారంభోత్సవం రేపు ఘనంగా జరగనుంది. ఈ వేడుకతో ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా సినిమా ఏ తరహా కథతో తెరకెక్కనుంది? ఇందులో రామ్ చరణ్ పాత్ర ఎలా ఉండబోతోంది? అనే ప్రశ్నలకు కొంత స్పష్టత రావచ్చని అభిమానులు ఆశిస్తున్నారు. ‘రంగస్థలం’లో రామ్ చరణ్‌ను పూర్తిగా భిన్నమైన పాత్రలో చూపించి సుకుమార్ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఇప్పుడు మరోసారి వీరిద్దరూ జతకట్టడంతో ఈసారి ఎలాంటి కథను ఎంచుకున్నారనే ఆసక్తి నెలకొంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు రేపటి వేడుకలో వెల్లడయ్యే అవకాశముంది.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999